
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 27 డిసెంబరు 2024



- కర్షకుడికి కన్నీళ్లు తెప్పిస్తున్న వరుణుడు
- వేలాది ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు
- మెట్టపైర్లకు కలుపు బెడద.. పొగాకు రైతుల్లో గుబులు
- మళ్లీ వర్షం కురుస్తుండటంతో ఆవేదన

ముసురు ముంచేస్తోంది !

కందుకూరు/ఉదయగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో వరుస తుఫాన్లు, అల్పపీడన ద్రోణుల ప్రభావంతో నెలకొన్న వాతావరణ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు మరింత ఆవేదన చెందుతున్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు నీట మునగడంతో పాటు తెగుళ్లు, పురుగులు ఉధృతి అధికమైంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపైరును కొందరు రైతులు కోతలు కోస్తుండగా, మరికొందరు కోసిన పైరును ఎండబెట్టిన వారు నష్టపో యారు. అలాగే మొలకదశలో ఉన్న శనగ, పూత, పిందె దశలో ఉన్న కంది, మినుము, పెసర, అలసంద పంటలతోపాటు పొగాకుకు తీవ్రం నష్టం వాటిల్లింది.

● పదిరోజులుగా వాతావరణం తెరపిచ్చి భూములు ఆరుదలకు వచ్చిన దశలో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటం, మరో రెండురోజులపాటు వర్షాలు ఉంటాయన్న వాతావరణశాఖ ప్రకటనతో కందుకూరు డివిజన్‌లోని కర్షకుల్లో గుబులు మొదలైంది. పొగతోటలకు ప్రత్య క్షంగా కాకున్నా పరోక్షంగా ఈ వర్షాలు తీవ్రనష్టం కలిగిస్తాయి. ముదురు పొగ తోటలు 20 రోజులుగా రెలుపులు ప్రారంభం కాగా, ప్రతి రెలుపునకు ఆకు జిగురు కారిపోయేలా వర్షం కురుస్తుండటంతో నాణ్యతలేని పొగాకు దిగుబడులు వస్తున్నాయి. లేత పొగనాట్లలో కలుపు విపరీతంగా పెరిగిపోయి ఏంచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. పొగ తోటల్లో కలుపు తీయాలంటే ఎకరాకు రూ.15-20వేల వరకు ఖర్చయ్యే పరిస్థితి. ఇన్నిరోజులు తేమ వాతావర ణం కొనసాగుతు న్నందున బొబ్బతెట్టు వంటి వైరస్‌తెగుళ్లు సోకే ప్రమాదం కూడా పొంచి ఉంది.

● ఇక మినుము సాగుచేసిన రైతుల పరిస్థితి అయితే చెప్పనవసరం లేదు. కందుకూరు డివిజన్‌లో రమారమి 15వేల ఎకరాల్లో మినుము సాగు చేసినట్లు అంచనా కాగా 90 శాతం విస్తీర్ణంలో ఇక కోతలు కూడా కోయటం వృథా అన్న అభిప్రాయానికి రైతులు వచ్చేశారు. మినుము పూత, పిందె దశలో ఉండగా తుఫాన్లు ప్రభావంతో భారీ వర్షాలు కురవటంతో బూడిదతెగులు సోకి పైరు దెబ్బతింది. అలాగే వర్షాధారంగా సాగుచేసిన కూరగాయలు పంటలు, కంది పైరుకు కూడా ఈ వర్షాల వల్ల నష్టమేనని కలుపులు విపరీతం అవటమే గాక చీడపీడలు పైర్లు ఎదుగుదల లేకుండా చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క పప్పుశనగ సాగుకు

- మిగతా 6వ పేజీలో



కలిగిరి : దెబ్బతిన్న పొగాకును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు



ఉదయగిరి ప్రాంతంలో దెబ్బతిన్న మినుము

జిల్లాలో జికా వైరస్ లేదు

- అందిన రక్తనమూనాల నివేదిక
- 22 మందికీ నెగటివే...
- చెన్నైలో కోలుకుంటున్న బాలుడు

మర్రిపాడు/ నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జికా వైరస్ కలకలం రేపిన బాలుడి రక్తనమూనాలకు పూణేలో నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ వచ్చినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గోపినాథ్ గురువారం తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బాలుడు ఇటీవల నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, ఆ బాలుడికి వైద్యులు నిర్వహించిన రక్తపరీక్షలో జికా వైరస్ లక్షణాలు కనిపించాయి. దీంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై గ్రామంలో పర్యటించారు. మూడురోజుల పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేసి, పారిశుధ్యం చర్యలు చేపట్టారు. బాలుడితో సన్నిహితంగా ఉన్న 22 మంది రక్త నమూనాలు సేకరించి పూణేలోని ల్యాబ్‌కు పంపారు. అక్కడ అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చినట్లు డాక్టర్ గోపీనాథ్ ప్రకటించారు. దీంతో కొంతకాలంగా భయభ్రాంతులకు గురవుతున్న గ్రామస్థులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం చెన్నైలో చికిత్స పొందుతున్న బాలుడి పరిస్థితి మెరుగ్గా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

● **ఎవరికీ లక్షణాలు లేవు..**

జిల్లాలో ఎవరికీ జికా వైరస్ లక్షణాలు లేవని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో జికా వైరస్‌పై 11 రోజులుగా వస్తున్న కథనాలకు బ్రేక్ వేసినట్లయింది. చెన్నైలో చికిత్స పొందుతున్న మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(5)కి కూడా జికా వైరస్ లేదని తమిళనాడుకి చెందిన పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ఈ నెల 19న ఓ నివేదిక ఇచ్చిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా బాలుడి నుంచి రక్త నమూనాలు సేకరించి పూణే ల్యాబ్‌కు పంపారని, అక్కడ ల్యాబ్‌లో కూడా జికా వైరస్ లేదని స్పష్టమయిందని ఆమె పేర్కొన్నారు.



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

ఘనంగా సీపీఐ వందేళ్ల ఉత్సవాలు

- నెల్లూరు, కందుకూరులో ప్రదర్శన
- నగర పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల ఉత్సవాలు గురువారం నెల్లూరు నగరంలో ఘనంగా జరి గాయి. గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ, ట్రంకు రోడ్‌ల మీదుగా సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యా లయం వరకు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీనియర్ నాయకుడు రామరాజు పార్టీ జెండా ను ఆవిష్కరించారు. అనం తరం నగర కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ స్వాతం త్ర్య పోరాటంలో ఉవ్వెత్తున విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, కర్షక ప్రజా నీకాన్ని కూడగట్టి తెల్ల దొరల్లో వణుకు పుట్టించిన ఎర్రజెండా వందేళ్లలో అడుగు పెట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా వందేళ్ల ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నాయకులు జిలాని ఖాన్, షేక్ షాన్‌వాజ్, చిన్న అంకయ్య, వినోదిని, వనజమ్మ సోఫియా, సాయిలత తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల చరిత్ర కమ్యూనిస్టులది...

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టులకు పోరాటాల చరిత్ర ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య పేర్కొన్నారు. పార్టీ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా గురువారం చౌడారెడ్డి స్తూపం వద్ద నుంచి కందుకూరులోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విక్కిరాలపేటరోడ్డులో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనను అంతమొందించటంలో నాలుగు వేలమంది కమ్యూనిస్టులు బలిదానం చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం పేదలకోసం పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. సీనియర్ నాయకుడు పీ బాలకోటయ్య అధ్యక్షతన జరిగిన సభలో నాయకుడు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, లక్ష్మీనారాయణ, హుస్సేన్, మురళి, కాకుమాని రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



నెల్లూరు నగరంలోని మినీ బైపాస్‌లో భోజనం బండి

బండిపై తిండి.. వెరీ ట్రెండీ !

- పెరిగిన స్ట్రీట్ ఫుడ్ వాహనాలు
- నడిచే హోటళ్లలో రుచిగా, శుచిగా ఆహారం
- సామాన్యులకు అందుబాటులో ధరలు
- విస్తరిస్తున్న మొబైల్ ఫుడ్ కోర్టు వ్యాపారం

నెల్లూరు నగరంతోపాటు ఇతర పట్టణాల్లోనూ రోజురోజుకు మొబైల్ ఫుడ్ కోర్టులు (నడిచే హోటళ్లు) విస్తరిస్తున్నాయి. వీటిల్లో లభించే ఆహార పదార్థాలు శుచిగా, రుచిగా ఉండడంతో ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అంతేకాక ఈ ఫుడ్ కోర్టులు పలువురు నిరుద్యోగులకు ఉపాధి చూపుతున్నాయి. పెద్ద పెద్ద హోటళ్లకు వెళితే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తున్నది. సంచార వాహనాల్లో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో చౌకగా, శుభ్రంగా ఉండటంతో వీటికి ఆదరణ పెరుగుతుంది.

- వివరాలు 6వ పేజీలో

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం



నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మో హన్ సింగ్ మృతిపై పలువురు నేతలు సంతాపం తెలిపారు. గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో మన్మోహన్ సింగ్ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సంతాపం తెలియచేశారు. అలాగే నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల పాటు ప్రధానిగా మన్మోహన్ సింగ్ పనిచేసి దేశ పురోభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖామంత్రిగా పలు సంస్కరణలను తీసుకువచ్చారని తెలిపారు. అలాంటి వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందటం ఎంతో బాధాకరమన్నారు.



సాగు సంపూర్ణం

వ్యవసాయానికి పేరుగాంచిన జిల్లాలో సరిగ్గా ఏడు నెలల క్రితం రైతుల ఆర్తనాదాలు వినిపించాయి. ధాన్యం ధరలు ఎక్కువగా ఉన్నా, నాటి పాలకుల అసమర్థ పాలనతో ఎకరా కూడా సాగుచేయలేని దుస్థితి దాపురించింది. ప్రాజెక్టుల్లో నీరు ఖాళీ కాగా, గతేడాది మొదటి పంట సగం ఆయకట్టులోనే సాగైంది. ఇక రెండో పంట ఊసే లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు చేరి, పూర్తి ఆయకట్టు సాగులోకి వచ్చింది. దీంతో జిల్లాలో ఎటుచూసినా పచ్చటి పైర్లతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. అదే సమయం లో పూడికతో నిండిన కాలువలు కొత్త రూపు సంతరించుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం పుణ్యమా.. అని సోమశిల అప్రాన్ పనులకు బ్రేకులు పడగ్గా.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబునాయుడు జిల్లాకు రావడంతో ఆ పనులు మొదలయ్యాయి. మొత్తంగా ఈ ఏడాది మొదటి ఆరు నెలలు అష్టకష్టాలు పడ్డ అన్నదాతలు, ఆ తరువాత ఆ కష్టాల నుంచి బయటపడ్డారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



సోమశిల జలాశయం ముందు జరిగిన అప్రాన్ పనులు



దువ్వూరు కాలువలో పూడిక తీస్తున్న యంత్రాలు

- ప్రతి ఎకరాకు నీరు.. అన్నదాతల ఆనందం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇరిగేషన్ ప్రాజెక్టులు, పనుల్లో కదలిక
- సీఎం చంద్రబాబు రాకతో అప్రాన్ పనుల ప్రారంభం
- పూడికతీతతో పంట కాలువకు కొత్తరూపు
- పెండింగ్ బిల్లుల చెల్లింపు, కాంట్రాక్టర్ల సంతోషం
- రైతు సంక్షేమం కోసమే సాగునీటి సంఘాల ఎన్నికలు

● జిల్లాకు వరప్రసాదిని సోమశిల ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు కండలేరు జలాశయం ఆధారపడి ఉంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సోమశిల జలాశయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రెండేళ్ల క్రితం వచ్చిన భారీ వరదలకు సోమశిల అప్రాన్ దెబ్బతింది. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడింది. వెంటనే అత్యవసరంగా పనులు చేపట్టాలని అప్పుడే హైపవర్ కమిటీ హెచ్చరించినా జగన్మోహన్‌రెడ్డి ప్రభు త్వం పట్టించుకోలేదు. పనులు ప్రారంభించాక కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో ఆగిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం హోదాలో చంద్రబాబునాయుడు సోమశిల జలాశయాన్ని సందర్శించారు. వెంటనే అప్రాన్ పనులు చేపట్టాలని, సకాలంలో బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో పనులు మొదలయ్యాయి. అలానే గేట్లు, రోప్‌లు వంటి ఇతర మెయింటెన్స్ పనులకు మరో రూ.6 కోట్లను మంజూరు చేయడంతో ఇప్పుడు ఆ పనులు కూడా జరుగుతున్నాయి. అదే సమయంలో మెట్ట ప్రాంతాల కల అయిన సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో కూడా పురోగతి కనిపిం చింది. భూసేకరణపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టడంతో త్వరలోనే కాలువ పనులు ప్రారం భం కానున్నాయి.

కాలువల్లో పూడికతీత

సాగునీటి యాజమాన్యంలో కాలువలు ప్రధానమైనవి. అలాంటి కాలువలను గత ప్రభుత్వంలో గాలికొదిలేశారు. గత మూడేళ్లుగా పూడిక తీయకుండానే తీసినట్లుగా బిల్లులు తినేశారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందలేదు. నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం కారణంగా గతేడాది సుమారు 20 టీఎంసీల నీటిని దుర్వినియోగం చేశారు. ఈ విషయమై కూటమి అధికారంలోకి రాగానే దృష్టి పెట్టి సుమారు రూ.30 కోట్లను మంజూరు చేసింది. దీంతో ప్రస్తుత సీజన్ మొదలయ్యేలోపు కాలువల్లో పూడికతీత పనులు పూర్తయ్యాయి. ఈ కాలువలను ఇప్పుడు చూస్తుంటే కొత్తగా కనిపిస్తున్నారు. అదే సమయంలో రానున్న రెండో పంటకు ఇంకా ఏవైనా కాలువల్లో పూడిక తీయాల్సి ఉంటే ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మరో రూ.20 కోట్లకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ రైతులకు కలిసొచ్చే అంశాలే.

● **సాగునీటి సంఘాలకు ఎన్నికలు**

మొదటి ఆరునెలల్లో తమను పట్టించుకునేదె వరన్న ఆందోళనలో ఉన్న రైతులకు ఆ తర్వాత మంచి రోజులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా ఎన్నికలు లేకుం డా ఉన్న సాగు నీటి సంఘాలకు కూటమి ప్రభు త్వం పట్టుదలతో ఎన్నికలు నిర్వహించింది. తద్వారా అనేక మంది రైతులకు పదవులు దక్కాయి. అంతేకాక రైతు సమస్యల

- మిగతా 6వ పేజీలో



రవాణా ఎట్టా!?

నెల్లూరులోని రవాణా శాఖ జిల్లా కార్యాలయం ముందు రోడ్డు అధ్వానంగా ఉంది. వాహనాల చక్రాలు మునిగిపోయేంత గుంతలు, వాటిలో వర్షపునీటితో ఆ వీధిలో బండి నడపాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులతోపాటు నిత్యం వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలు ప్రజలు వస్తుంటారు. వారందరికీ ఇక్కడి రోడ్డు నరకం చూపిస్తోంది.



స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వైభవంగా శ్రీహరి కళ్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మార్గశిర బహుళ ఏకాదశి సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. అర్చకులు , వేద పండితులు శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణోత్సవం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అందని కౌలు రైతు కార్డు

- మూడు నెలలుగా తిప్పుకుంటున్న వీఆర్వో
- బాధిత రైతు ఆవేదన

వలేటివారిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కౌలురైతు కార్డు కోసం దరఖాస్తు చేసి మూడు నెలలు అవుతున్నా వీఆర్వో మల్లేశ్వరి సర్వర్ లేదని ఒకసారి, నా లాగిన్ పనిచేయడం లేదని మరొకసారి, మీరు పెట్టిన దరాఖాస్తు కనిపించడం లేదని ఇలా తిప్పుకున్నారని పోలినేనిపాలెం రైతు మాదాల చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశాడు. కౌలురైతు కార్డుకు అన్ని అర్హతలున్నా వీఆర్వో ఇబ్బందులు పెడుతున్నట్లు బాధితరైతు వాపోయాడు. కార్డు లేకపోవడంతో బ్యాంకులో పంట రుణం పొందలేక సకాలంలో పంటలు సాగు చేయలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కౌలు కార్డులు పంపిణీ సైట్‌ను నిలిపివేసిందని, వీఆర్వో మాత్రం కౌలు కార్డుకు మళ్లీ దరఖాస్తు చేయాలని సలహా ఇస్తుందని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి విధుల పట్ల బాధ్యతారహిత్యంగా వ్యవహరించే వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని రైతు చిరంజీవి కోరారు.

ఎరువుల పంపిణీ



కొండముడుసుపాలెంలో రైతుసేవా కేంద్రం ద్వారా రైతులకు యూరియా అందజేస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండముడుసు పాలెంలో రైతుసేవా కేంద్రం లోని యూరియాను వ్యవసాయాధికారులు ఎమ్మార్పీ ధరలకు గురువారం రైతులకు పంపిణీ చేయించారు. అనం తరం కొండ ముడుసుపాలెం, కంచరగుంటలో పొలం పిలుస్తోందిలో భాగంగా ఏఓ వి.రాము పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్ర మంలో మండల పశువైద్యాధికారి చెన్నకేశవులు, ఉద్యాన వ్యవసాయ సహాయకులు రమాదేవి, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

బండిపై తిండి
వెరీ ట్రెండీ

- పెరిగిన స్ట్రీట్ ఫుడ్ వాహనాలు
- నడిచే హోటళ్లలో రుచిగా, శుచిగా ఆహారం
- వెజ్, నాన్‌వెజ్, టిఫిన్లు అన్నీ...
- సామాన్యులకు అందుబాటులో ధరలు
- విస్తరిస్తున్న మొబైల్ ఫుడ్ కోర్టు వ్యాపారం
- ఆదరిస్తున్న పట్టణ, నగర వాసులు
- ఎంతోమందికి స్వయం ఉపాధి



ముత్తుకూరు రోడ్డులో బిర్యానీ అమ్మకాలు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంతోపాటు ఇతర పట్టణాల్లోనూ రోజురోజుకు మొబైల్ ఫుడ్ కోర్టులు (నడిచే హోటళ్లు) విస్తరిస్తున్నాయి. వీటిల్లో లభించే ఆహార పదార్థాలు శుచిగా, రుచిగా ఉండడంతో ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అంతేకాక ఈ ఫుడ్ కోర్టులు పలువురు నిరుద్యోగులకు ఉపాధి చూపుతున్నాయి. పెద్ద పెద్ద హోటళ్లకు వెళితే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తున్నది. సంచార వాహనాల్లో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో చౌకగా,శుభ్రంగా ఉండటంతో వీటికి ఆదరణ పెరుగుతుంది.

● మండలాల్లోనూ..

జిల్లాలోని పట్టణ, నగర ప్రాంతాల్లోనే కాకుండా కొన్ని మండల కేంద్రాల్లోనూ ఇలాంటి వాహనాలకు ప్రజాదరణ పెరుగుతోంది. ఈ వాహనాల్లో కొనుగోలు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉండటంతో కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో ఇలాంటి వాహనాల ద్వారా జరిగే అమ్మకాలకు మంచి ఆదరణ లభిస్తుంది. ఎక్కడ చూసినా సంచార వాహనాల్లో తయారవుతున్న ఆహార పదార్థాలను జనం ఆసక్తిగా తింటున్నారు. వెజిటేరియన్ వంటకాలకే కాక నాన్ వెజిటేరియన్ వంటకాలకు కూడా డిమాండ్ ఉంది. పెద్ద పెద్ద హోటళ్లలో రూ. 150 నుంచి రూ. 250 విలువ చేసే మటన్, చికెన్ బిర్యానీలను సైతం ఈ ప్రత్యేక వాహనాల్లో కేవలం రూ. 80 నుంచి రూ. 100 కు మాత్రమే విక్రయిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారంతోపాటు భోజనాలను కూడా ఆయా వాహనాల ద్వారా అందిస్తున్నారు. నెల్లూరు నగరంలోని చిల్డ్రన్‌పార్క్ రోడ్డు నుంచి మినీబైపాస్, రాజరాజేశ్వరి ఆలయం వరకు ఈ సంచార వాహనాలు దర్శనమిస్తూ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.



చిల్డ్రన్స్ పార్కు వద్ద అంబలి విక్రయం

● ఎంతోమందికి ఉపాధి

ఇలాంటి సంచార వాహనాల ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తున్నది. ఒక్కో వాహనం ద్వారా రోజుకు రూ. 3వేల నుంచి రూ. 4వేల వరకు ఆదాయం గడిస్తున్నారు. కొన్ని వాహనాల వద్ద భార్యాభర్తలతో పాటు కుటుంబ సభ్యులు కష్టపడుతూ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఆయా వాహనాలలో అన్నీ రకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయి. దీంతో ఆహార ప్రియులు వీటిని ఆశ్రయిస్తున్నారు.

ఒకరిపై ఆధార పడకుండా...



ఒకరిపై ఆధార పడకుండా స్వయం ఉపాధి కింద ఈ ప్రత్యేక వాహనం ద్వారా ఆహార పదార్థాల అమ్మకాలు చేస్తున్నా. ఎంతో మంది ఇక్కడకు వస్తుంటారు. వారికి అభిరుచులకు తగ్గట్లు మంచి రుచితో ఆహార పదార్థాలు అందిస్తున్నా. ఐదేళ్లుగా అమ్మకాలు సాగిస్తున్నా. ఈ వ్యాపారం ద్వారా ఉపాధి పొందుతున్నా.

- నిరోష్, ఫుడ్ కోర్టు నిర్వాహకులు

ఎంతో ఆదరణ



నగరంలోని హరనాథపురం ప్రధాన రహదారిలో ఉన్న తన సంచార వాహనంలో విక్రయిస్తున్న మటన్ బిర్యానీకి ఎందో ఆదరణ ఉంది. నావాహనం వద్ద ఎప్పుడూ విని యోగదారులు బారులు తీరి ఉంటున్నారు. ప్రతి రోజూ ఈ వాహనం వద్ద నలుగురు పని చేస్తూ ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఆహారాన్ని అందిస్తున్నారు. మాకెంతో సంతోషంగా ఉంది. కష్టానికి తగ్గ ఫలితం కూడా ఉంటున్నది.

- నసీం, వ్యాపారి

ఎక్కువగా రాగి జావ కొనుగోలు



చిల్డ్రన్ పార్క్‌రోడ్‌లో నా వాహనం ఉంటుంది. అక్కడ ఎక్కువ మంది రాగిజావ కొనుగోలు చేస్తున్నా రు. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగేళ్ల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నా. ఎంతో బాగుంది. కేవలం రూ. 20కే రాగిజావం అందిస్తున్నా. రోజూ వాకింగ్‌కు వస్తున్న వారే కాక సాధారణ ప్రజలు కూడా కొనుగోలు చేస్తున్నారు.

- యుగంధర్, వ్యాపారస్థుడు

పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం

- సోమిరెడ్డితో సీఎంను కలిసిన పారిశ్రామికవేత్తలు



సీఎం చంద్రబాబుతో సోమిరెడ్డి, పారిశ్రామికవేత్తలు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడును పలువురు పారిశ్రామికవేత్తలు అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీలోని విశాఖపట్నంతో పాటు నెల్లూరులోనూ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు సంసిద్ధత వ్యక్తం చేశారు. కంపెనీ కార్యకలాపాలు, ఏర్పాటు చేసే పరిశ్రమలు, స్థానికంగా లభించే ఉపాధి తదితర వివరాలను సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో మెడిటాక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మితేష్ పటేల్, ఎఫ్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ఎఫ్‌సీ పటేల్, మోలెక్యుర్ కాటలిస్ట్ కంపీనీ సీఈవో వెంకట బలగాని, డైరెక్టర్ భరత్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక బిల్లులు పరిష్కరించాలి

- డీఎంహెచ్‌వోతో హంస నాయకుల భేటీ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఉద్యోగులకు సంబంధించిన వేతనాలు, ఇతర ఆర్థికపరమైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతను ఆంధ్ర ప్రదేశ్ హెల్త్ అడ్మినిస్టేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియే షన్ (హంస) నాయకులు కోరారు. సుజాత ఇటీవల డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో హంస నాయకులు గురువారం ఆమెను కార్యాలయంలో కలిసి సత్కరించారు. హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజెర్ల సుధాకర రావు, కమల్ కిరణ్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవద, హంస అసోయేట్ ప్రెసిడెంట్ నారాయణ రాజు, శేషగిరిరావు, మజ్రుల్లా, సుధాకర్‌రెడ్డి, సహనా, వెంకట మురళి పాల్గొన్నారు.

సాగు సంపూర్ణం

(5వ పేజీ తరువాయి)



సంగం మండలం అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, టీసీ సభ్యులు (ఫైల్)

పరిష్కారానికి వేదికలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో 486 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 6 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలను ప్రభుత్వం పూర్తి చేసింది. ఇకపై రైతులు తమ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరంలేదు. ఈ కమిటీలే ఎక్కడి కక్కడ అన్నీ వ్యవహారాలు చూసుకుంటాయి. కాలువల నిర్వహణకు టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు అరకొరగా పనులు చేయడం వంటివి లేకుండా ఇకపై ఈ కమిటీలు, రైతులు భాగస్వామ్యంతో పనులు చేపట్టనున్నాయి.

● పెండింగ్ బిల్లులకు మోక్షం


ఇరిగేషన్‌శాఖలో పేరుకున్న పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో కాంట్రాక్టర్ల కుటుంబాలు అప్పుల నుంచి గట్టెక్కుతున్నాయి. ముఖ్యం గా 2014-19 మధ్యన నీరు-చెట్టు పథకం కింద పనులు చేసిన కాం ట్రాక్టర్ల బిల్లులను వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఆ బిల్లులను ప్రాధాన్యత క్రమంలో చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం తొలి విడతగా సుమారు రూ.250 కోట్లను మంజూరు చేసింది. జిల్లాలో సుమారు రూ.20 కోట్లకుపైగా నీరు-చెట్టు బిల్లులను చెల్లించారు. అలానే కీలకమైన పెన్నా రక్షణ గోడల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను కూడా ఇటీవల చెల్లించింది.

● కృష్ణా జలాల రాక

రెండేళ్ల తర్వాత జిల్లాలో పూర్తి విస్తీర్ణంలో సాగు జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో సోమశిల, కండలేరు జలాశయాల కింద సుమారు 8 లక్షల ఎకరాల్లో వివిధ పైర్లు సాగవుతున్నాయి. అందులో మెజారిటీ విస్తీర్ణంలో వరిసాగు జరుగుతోంది. గతేడాది ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నా సరిగ్గా నీటి యాజమాన్యం చేయలేక నీటిని దుబారా చేశారు. ఆ ప్రభావంతో గతేడాది ఇదే సీజన్‌లో మూడు లక్షల ఎకరాలకు మించి ఆయకట్టుకు నీరు అందించలేకపోయారు. ఈ ఏడాది మేలో రెండో పంట అసలు సాగు కాలేదు. ఓ వైపు మార్కెట్లో ధాన్యం ధర పుట్టి రూ.25 వేలు పలుకుతున్నా సాగు లేకపోవడం రైతులను తీవ్ర వేదనకు గురి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగస్టు ఒకటి నుంచి కృష్ణా జలాలను సోమశిలకు తీసుకురావడం మొదలు పెట్టింది. రెండు నెలల పాటు శ్రీశైలం నుంచి జలాలు వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటు సోమశిల, అటు కండలేరు ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. ఫలితంగా ప్రస్తుత సీజన్‌లో ప్రతీ ఎకరాకూ నీరు అందించగలిగారు.

ముసురు ముంచేస్తోంది !

(5వ పేజీ తరువాయి)



కందుకూరు ప్రాంతంలో మినుము చేనులో వర్షపునీరు

అదను పోవటంతో శనగ సాగుచేయదలచిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాధారణంగా శనగ పైరును అక్టోబరు చివరివారం నుంచి నవంబరు 15లోగా సాగుచేస్తారు. అయితే అక్టోబరు ద్వితీయార్థం నుంచి నేటి వరకు భూములు ఆరకుండా వర్షాలు కురుస్తూనే ఉండటంతో శనగ సాగుకు వీలుకాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జనవరి పదవ తేదీవరకు భూములు ఆరే పరిస్థితి లేదని తేలిపోయింది. ఆ సమయంలో శనగ సాగుచేసినా 50 శాతం దిగుబడులు కూడా వచ్చే అవకాశం లేకపోవటంతో ఎకరానికి రూ.30-35వేల వరకు కౌలుచెల్లించి భూములు తీసుకున్న రైతులు ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు.

● వింజమూరు, ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌ల పరిధిలో వేల ఎకరాల్లో మినుము, శనగ, కంది పంటలు సాగు చేశారు. ఈ నెల తొలి వారంలో కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో పంటల సాగు జాప్యమైంది. ఆలస్యంగా సాగు చేసిన శనగ పంట మొలకదశలో వర్షాలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే కంది, మినుము పంటలకు వర్షాల కారణంగా తెగుళ్ల విజృంభించడంతో వాటి నివారణకు మందులు పిచికారీ చేసి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతోపాటు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కలిగిరి : కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో సుమారు 3 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేయగా అకాల వర్షాలతో 450 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఎకరా విస్తీర్ణంలో మళ్లీ మొక్కలు నాటాలంటే సుమారు రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని సాగుదారుడు ఆవేదన చెందుతున్నాడు. దీనికి తోడు మిగిలిన పంటపై బొబ్బ తెట్టు ఆశించడం, పురుగు చేరడం, కలుపు అమాంతం పెరిగిపోవడంతో అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

'పొదుపు' నిధి..
అతివకు పెన్నిధి!

- డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు
- సద్వినియోగం చేసుకుంటున్న నారీమణులు
- స్వయం ఉపాధితో కుటుంబానికి ఆర్థిక భరోసా

సంగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేటి తరం మహిళలు పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉంటూ సక్రమంగా పొదుపులు చెల్లిస్తున్నారు. దీంతో బ్యాంక్ లింకేజీ రుణాలతోపాటు స్త్రీనిధి రుణాలు విరివిగా అందుతున్నాయి. సదరు రుణాలతో ఫ్యాన్సీ, పాల, చిల్లర, పూల దుకాణాలు, గేదెల పెంపకం వంటి చిరు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా నిలదొక్కుకుటుఉన్నారు. రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లిస్తూ మరింత మొత్తంలో రుణాలు పొందేందుకు మార్గం సుగమమం చేసుకుంటున్నారు. సంగం మండలంలోని పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు పొదుపు రుణాలు పొంది చిరు వ్యాపారులు ప్రారంభించారు. కుటుంబ అవసరాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ అందరిచేత మన్ననలు పొందుతున్నారు.

పెంచలమ్మ, వెంగారెడ్డిపాళెం, పొదుపు సభ్యురాలు



బొమ్మల తయారీ

ఈమె పేరు పెంచలమ్మ, వెంగారెడ్డిపాళెం. పొదుపు సంఘం సభ్యురాలు. సంఘం ద్వార బ్యాంకు రుణం తీసుకుంది. ఆ రుణంతో వినాయక బొమ్మల తయారీలో పెట్టుబడిగా పెట్టుకుంది. దీంతో ప్రతి ఏటా ఆదాయం గడిస్తోంది. తద్వార వచ్చే ఆదాయంతో రుణం చెల్లిస్తూ తన కుమారుడిని చదివిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది

ఒక గేదెతో మొదలై...



సంపూర్ణమ్మ, కొరిమెర్ల, పొదుపు సభ్యురాలు

ఈమె పేరు సంపూర్ణమ్మ, సంగం మండలంలో కొరిమెర్ల గ్రామం. పొదుపు లీడరుగా ఉంటూ కుంటుంబ బాధ్యతలను తలకెత్తుకుని రాణిస్తోంది. బ్యాంకు రుణాలతో ఒక్కో గేదెను కొంటూ పదేళ్లలో 15 పాడి పశువులను అభివృద్ధి చేసింది. పది పశువుల దాకా పాలు ఇస్తున్నాయి. రోజుకు 40 లీటర్ల పాలను కేంద్రానికి సరఫరా చేస్తోంది. వచ్చే డబ్బులు పొలం సాగుకు పెట్టుబడితోపాటు ఇంటి ఖర్చులకు సరిపోతున్నాయి.

ఫ్యాన్సీ దుకాణం నడుపుతూ..



మహేశ్వరి, సంగం, పొదుపు లీడరు

సంగం కుమ్మరివీధికి చెందిన ముత్యం మహేశ్వరిది మధ్య తరగతి కుటుంబం. పొదుపులక్ష్మీ రుణంతోనే సంగం సత్రం సెంటర్‌లో బంకు పెట్టుకుని చిన్న పిల్లల నుంచి పెద్దలకు అవసరమైన అన్ని రకాల ఫ్యాన్సీ వస్తువు విక్రయిస్తోంది. అలా వచ్చే ఆదాయంతో తన ఇద్దరి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో ఉన్నత చదువులు చదివిస్తోంది. కుంటుబానికి ఎటువంటి ప్రైవేటు అప్పులు చేయకుండానే ఆర్థిక స్వావలంబన సాధించింది. పొదుపు తనకు భరోసా ఇచ్చిందని గర్వంగా చెప్పుకుంటోంది.

లలిత, అనసూయ నగర్, పొదుపు లీడర్



ఎంబ్రాయిడింగ్‌తో స్వయం ఉపాధి

అనసూయనగర్‌కు చెందిన లలిత అనే యువతి పొదుపులీడరుగా చేరిన అనతికాలంలోనే ప్రభుత్వం అందచేసినన ఎంబ్రాయిడింగ్‌లో శిక్షణ పొందింది. ఆ శిక్షణతో పొదుపు ద్వారా బ్యాంకు నుంచి తెచ్చిన రుణంతో ఇంటివద్దే ఎంబ్రాయిడింగ్ చేస్తూ మరో నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.



వేదగిరీశుడికి తిరుప్పావడ సేవ

వేదగిరి క్షేత్రంలో వెలసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారి జన్మనక్షత్రం స్వామి పర్వడి సందర్భంగా గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. ముందుగా స్వామి వారిక విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో తిరుప్పావడ సేవను జరిపారు.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



ఎదురుగా వాహనాలు వస్తే పరుగెత్తాల్సిందే!

వర్షం నీరు వెళ్ళే మార్గం లేక రోడ్డుపైనే నిలిచి పోతుండడంతో ఎదురుగా వాహనాలు వస్తే ఎక్కడ మురుగునీరు పైన పడుతుందోనని పాదచారులు పక్కకు పరుగెత్తాల్సిన పరిస్థితి కలువాయి బస్టాండులో నెలకొంది. సోమశిల- పొదలకూరు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల ముందు ఎత్తుగా మట్టి పోసుకున్నారు. దీంతో రోడ్డుపై నీరు నిలిచి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా పెంచులోకి గరుడ సేవ



పెంచలకోన క్షేత్రంలో గురువారం నరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, శ్రీవార్లకు నృసింహ యాగం, 11గంటలకు శ్రీవార్లకు కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకి బంగారు గరుడసేవ, క్షేత్రోత్సవం ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణలతో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలలో కాసా పెంచలవరప్రసాద్‌నాయుడు, ధర్మపత్ని పద్మావతమ్మ, కుమారుడు పెంచలసాయి పవన్, భక్తులు పాల్గొన్నారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో

జిల్లాకు ఏడు పతకాలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనెల 23 నుంచి 25వరకు జరిగిన 41వ ఎస్‌టీపీఎస్ సబ్‌జూనియర్ ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఏడు పతకాలు సాధించారు. బాలుర రికర్వ్ రౌండ్‌లో కే తరుణీష్ జాత్య మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ఆర్ సాయిమౌర్య రెండో స్థానం, సీహెచ్ అక్షయ్ మహదేవ్ మూడు, పీ రాజేష్ నాలుగో స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. బాలుర ఇండియన్ రౌండ్‌లో జీ వెంకటలోకేష్ బంగారు పతకం, ఏ సాత్విక్ రజత పతకం సాధించారు. బాలికల ఇండియన్ రౌండ్‌లో ఏ లాస్య కాంస్య పతకం చేజిక్కించుకుంది. ఒకేసారి జిల్లాకు ఏడు పతకాలు దక్కడంపై జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష, కార్యదర్శి పావురాల వేణు హర్షం వ్యక్తం చేశారు. కోచ్‌లు టీ శివశంకర్, వీ భరద్వాజ్ రెడ్డి, ప్రకాష్, హారతిని సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు రాజస్థాన్‌లో జనవరి 3 నుంచి జరిగే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని, క్రీడాకారుడు కే చరిత్ స్టాండ్‌బైగా ఎంపికైనట్లు తెలిపారు. కాగా, రాష్ట్రస్థాయి పోటీల్లో మూడోస్థానంలో నిలిచిన చాట్ల అక్షయ్ మహదేవ్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందించారు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న మహదేవ్ జాతీయ పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు, డైరెక్టర్ రాజేష్, కోచ్ దివ్య ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీఎస్‌యూలో సాహిత్య సదస్సు

వెంకటాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం ఆధునిక తెలుగు కవిత్వం - భారతీయ వ్యవసాయ రంగ ప్రతి ఫలనం అనే అంశంపై సాహిత్య అకాడమీ సౌజన్యంతో సాహి త్య సదస్సును నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా వీసీ సారం గం విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ పాల్గొనున్నారు.

మత్స్యకారుడి మృతి



సముద్ర జలాల్లో పడి మృతి చెందిన మత్స్యకారుడు పార్వతయ్య

ముత్తుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లంగర్ వేసిన బోటులో నుంచి ప్రమాదవశాత్తు సముద్ర జలాల్లో పడి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన గురువారం కృష్ణపట్నం పోర్టులో చోటుచేసుకుంది. పోర్టు పోలీసులు కథనం మేరకు.. బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ పాత బంగారుపాలెం పట్టపు కాపు ప్రళయ కావేరి పార్వతయ్య (55) మరికొందరితో కలిసి చెన్నై నుంచి బోటులో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో సముద్రంలోకి ఇతర బోట్లతో కలిసి పార్వతయ్య బోటు కండలేరు క్రీకులో లంగర్ వేసింది. బుధవారం రాత్రి భోజనం చేసి పడుకున్న బోటు సిబ్బందికి గురువారం ఉదయం పార్వతయ్య కనిపించలేదు. తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి ఉండొచ్చని అతని కోసం చుట్టూ గాలించారు. గురువారం సాయంత్రం పోర్టు బెర్తుల వద్ద పార్వతయ్య మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోర్టు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



శీనయ్య మృతదేహం

వెంకటాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిక్కవరప్పాడు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటేపల్లి గిరిజన కాలనీ శీనయ్య (40) మరణించాడు. పని నిమిత్తం సర్వేపల్లికి మోటర్ సైకిల్‌పై వెళ్లి తిరిగి కంటేపల్లికి వస్తుండగా తిక్కవరప్పాడు - గొలగమూడి మధ్యలో రోడ్డుపై ఉన్న గుంతలతో మోటర్ సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో శీనయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయాన్ని ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాత్రూమ్‌లో వృద్ధుడి..

నెల్లూరు(క్రైం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని హరనాథపురం రెండో వీధిలో ఓ ఇంట్లోని బాత్రూమ్‌లో భరత్‌రెడ్డి(64) అనే వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... భరత్‌రెడ్డి నగరంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఆయన ఉంటున్న ఇంట్లో నుంచి తీవ్ర దుర్గంధం వ్యాపించడంతో స్థానికులు బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికుల సహకారంతో తలుపులు పగులగొట్టి లోపల చూడగా భరత్‌రెడ్డి బాత్రూమ్‌లో మృతిచెంది ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. భరత్‌రెడ్డి భార్యపిల్లలు గతంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారాని, అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్నాడని స్థానికులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	228
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7339
వెండి కిలో ధర	రూ. 90,500
వెండి ఒక గ్రాము	రూ.93.50

జీతాలివ్వండి మహాప్రభో!

- గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు అందని వేతనాలు
- మూడు నెలలకు రూ.1.30 కోట్లు బకాయి
- పింఛనుదారులకూ ఎదురుచూపులే!
- గ్రాంటు రాక నిలిచిన చెల్లింపులు
- పాలక మండలికి నోచుకోని సంస్థ



నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పుష్కలంగా నిధులున్నా నెలల తరబడి జీతాలు రాకపోవడంతో జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు వేడుకుంటున్నారు. ఆ సంస్థ పనిచేస్తున్న 41 మందికి మూడు నెలల జీతం బకాయిలు సుమారు రూ.1.30కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన 75 మందికి రెండు నెలల పింఛను రూ.25లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం గ్రాంటు విడుదల చేయకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి జీతాలు ఇప్పించాలని వేడుకొంటున్నారు.

● సెస్ వసూళ్లకు పాత విధానం అమలు చేయాలి

జిల్లా గ్రంథాలయ సంస్థకు నెల్లూరు నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల నుంచి సెస్సు బకాయి సక్రమంగా జమ కావాలంటే పాత విధానం అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగులు సూచిస్తున్నారు. 2016 జూన్ నెల వరకు పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజల వద్ద ఇంటి పన్ను వసూలు చేసిన వెంటనే గ్రంథాలయం సెస్సు నేరుగా గ్రంథాలయ సంస్థకు జమ అయ్యేదని , 2016 జూన్ తర్వాత ఈ విధానం అమలు కానందునే సెస్సు బకాయిలు కొండల్లా పేరుకు పోయాయని ఆరోపించారు. ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థకు నెల్లూరు నగర పాలక సంస్థ, ఇతర మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్ శాఖల నుంచి రూ.41 కోట్లకు పైగా సెస్సు బకాయిలు రావాల్సి ఉంది. ఈ నిధులు చెల్లించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పాలక మండలి ఎప్పుడు?

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లు దాటినా జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన పాలక మండలికి నోచుకోవడం లేదు. దీనివల్ల సెస్సు సక్రమంగా వసూలు కావడంలేదనే ఆరోపణలున్నాయి. గత వైసీపీ ప్రభు త్వంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు ఛైర్మన్‌ను నియమించి కార్యవర్గాన్ని నియమించలేదు. దీంతో ఆ ఐదేళ్ల సంస్థ పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వరకు ఉన్న గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఈ ఏడాది జూన్ 7వతేదీన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి పాలక మండలి ఏర్పాటుకాలేదు.

బీపీసీఎల్ రాకతో

జిల్లాకు మహర్దశ

- సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రామాయ పట్నం సమీపంలో రూ.95 వేల కోట్ల పెట్టుబడితో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రిఫైనరీ, పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుండటంపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమ రాకతో జిల్లా స్వరూప మే మారిపోతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాకు ఇంతటి భారీ ప్రాజెక్టు రావటం గర్వంగా ఉందని తెలియచేశారు. ఇందుకోసం శ్రమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. చంద్రబాబు మార్గ నిర్దేశంలో రాష్ట్రం ఎంతో ముందుకు వెళుతుందని, పరిశ్రమల రాకతో నిరుద్యోగ సమస్య కు పరిష్కారం లభిస్తుందన్నారు. బీపీసీఎల్ పరిశ్రమతో ప్రత్యక్షంగా 5 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఆ కంపెనీ నిర్మాణ సమయంలో దాదాపు లక్ష మందికి ఉపాధి దొరుకుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సంస్థతోపాటు 15 అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటై లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ప్రక్షాళన

- డీఎంహెచ్‌వో పలు విభాగాల పరిశీలన
- అధికారిక ఉత్తర్వులు లేకుండానే డిప్యూటేషన్‌లు
- ఆంధ్రజ్యోతి కథనంపై చర్చ



హాజరు పట్టిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాళనకు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం' అన్న కథనంపై దృష్టి పెట్టారు. రిజర్వ్ వైద్యుల పరిస్థితి ఏమిటి.. వారు ఎందుకు రావటం లేదు.. వచ్చిన వారు ఎందుకు హాజరు వేయటం లేదు.. వారిని ఎవరు నియమించారు.. వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ నియమించారా.. డీఎంహెచ్‌వో నియమించారా..? తదతర వివరాలను గురువారం అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరిగ్గా హాజరు కాని వైద్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది. అలాగే ఎవరెవరు ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఉన్నారు. వారికి అనుమతులు ఎలా ఇచ్చారు...వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా వారి వివరాలు సేకరించారు. వీరిలో కొందరు డిప్యూటేషన్‌లు రద్దు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. మొత్తం 14 మంది డిప్యూటేషన్‌లపై ఉన్న వారిని తొలగించి పీహెచ్‌సీలో వెళ్లాలని ఆదేశించినట్లు తెలిసింది. అలాగే ఎఫ్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా నియమించిన వైద్యురాలిని పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఇదిలా ఉంటే వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.వైద్యులు, సిబ్బది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. ఎవరు నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. కాగా ఆంధ్రజ్యోతి కథనంపై ఉద్యోగ వర్గాలలో తీవ్ర చర్చ జరిగింది.

● అధికారిక అనుమతులు లేకుండా

డీఎంహెచ్‌వో కార్యాలయంతోపాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో అసలు జిల్లా వైద్యాధికారి అధికారిక అనుమతులకు సంబంధించి డిప్యూటేషన్‌లపై ఇంకా కొనసాగుతున్నాయి. జిల్లా కార్యాలయంలోనే ఎపిడయాలజి విభాగంలో ఐదుగురు ఎలాంటి ఉత్తర్వులు లేకుండా గత డీఎంహెచ్‌వో నోటిమాట తోనే ఇక్కడ పనిచేస్తున్నట్లు తెలుస్తున్నది. జిల్లా వ్యాప్తంగా పలువురు ఉద్యోగులు కూడా ఇలాంటి ఉత్తర్వులతోనే ఉద్యోగాలలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

నేడు అయ్యప్ప నగరోత్సవం



అయ్యప్పస్వామికి శ్రీవేలి ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజలు గురువారం నాటికి 41 వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా స్వామివారికి చందనాలంకారం జరిగింది. మండల పూజల్లో ఉదయం పాలభిషేకం, గణపతి పూజ, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం జరిగాయి. కలశ పూజ, ఉచ్ఛపూజ, నవకాభిషేకం, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పూలంగిసేవ, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాళంపూజ, పడి కర్పూర హారతులు, శ్రీవేలి ఉత్సవం జరిగాయి.

కాగా, మండలపూజల్లో భాగంగా శుక్రవారం నగరోత్సవం జరుగుతుందని ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కేవీ రత్నం, కోశాధికారి గడ్డం రత్నం తెలిపారు. ఉదయం స్వామివారు నవాబుపేట శివాలయానికి చేరుకుంటారని, అక్కడ విశేష అలంకరణ అనంతరం ఊరేగింపుగా అయ్యప్పగుడికి చేరుకుంటారని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

కామాక్షితాయి నిత్యాన్నదానానికి

భారీ విరాళాలు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ నిత్యాన్నదాన సదనానికి దాతలు ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడు గ్రామానికి చెందిన పులి సుబ్బారెడ్డి, భార్య గారతమ్మ దంపతులు రూ.6,25,000, నెల్లూరు నగర వాస్తవ్యులు కొమ్మి మల్లికార్జుననాయుడు, రాధిక దంపతులు రూ.1,60,000 విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు వారి గోత్ర, నామములతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి

- ఈడీవో అప్పలరాజు



ఆర్టీసీ ప్రధాన బస్టాండును పరిశీలిస్తున్న ఆపరేషన్స్ ఈడీ అప్పలరాజు, సీటీఎం నాగేంద్రప్రసాద్, ఈడీ వెంకటేశ్వరరావు, డీఎంలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి కృషి చేయాలని సంస్థ ఈడీ (ఆపరేషన్స్) అప్పలరాజు, సీటీఎం నాగేంద్ర ప్రసాద్ సూచించారు. గురువారం నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు, 2వ డిపో గ్యారేజ్‌లో ఉన్న ఎలక్ట్రికల్ బస్సుల చార్జింగ్ పాయింట్లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్లు మురళీబాబు, శివకేశవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలి: కేవీకే శాస్త్రవేత్త కిరణ్



వర్మికంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడ కాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచా లని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ కే కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. నెల్లూరులోని కేవీకేలో గురువారం వర్మికంపోస్టు తయా రీపై శిక్షణ కార్యక్ర మం జరిగింది. ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువుల తయారీ వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. నేలను సహజ పద్ధతిలో సారవంతం చేయడంలో వానపాములు ముఖ్యపాత్ర పోషి స్తాయని, అందుకే రైతులకు సహజ మిత్రులుగా వానపాములను పిలుస్తారన్నారు. తేమగల నేలల్లో వానపాములు బొరియలు చేసుకుని భూమిలోని సేంద్రీయ వ్యర్థాలను ఆహారంగా తీసుకుని సారవంతమైన మట్టిని విసర్జిస్తాయని, ఆపదర్థాన్నే వర్మికంపోస్టు అంటారని వివరించారు. వర్మికంపోస్టు తయారీ, వాడే విధానం, ఉపయోగాలను రైతులకు వివరించారు.

బీసీ సంక్షేమాధికారిగా లక్ష్మమ్మ

- ప్రసూన కర్నూలుకు బదిలీ



లక్ష్మమ్మ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బీసీ సంక్షేమాధికారిగా వెంకటలక్ష్మమ్మ గురువారం నెల్లూరులోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో పనిచేస్తున్న కొల్లి ప్రసూన కర్నూలు జిల్లా బీసీ సంక్షేమాధికారిగా బదిలీ అయ్యారు. ఈ క్రమంలో లక్ష్మమ్మకు ప్రసూన బాధ్యతలు అప్పగించారు. లక్ష్మమ్మ గ్రూపు-1 అధికారి, ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ గ్రూప-1కు ఎంపి కైనారు. 2019లో కర్నూలు జిల్లా బీసీ సంక్షేమాధికారిగా నియమితులయ్యారు. బదిలీపై నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేం దుకు కృషి చేస్తానని చెప్పారు.

5న స్వర్ణాంధ్ర విజన్-2047

చైతన్యయాత్ర

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2024 చైతన్య యాత్రను జనవరి 5న ప్రారంభిస్తున్నామని భారత్ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే శిఖామణి, కార్యదర్శి ఎస్‌కే ఖాసీం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని గాంధీ బొమ్మ కూడలి నుంచి ఈ యాత్ర మొదలవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలలకు రూపం స్వర్ణాంధ్ర విజన్-2047గా అభివర్ణించారు. స్వర్ణాం ధ్ర విజన్ సాధన కోసం ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఇష్టారాజ్యం..ఇక చెల్లదు !

- సచివాలయాల్లో ముఖహాజరు అమలు
- ఉదయం, సాయంత్రం తప్పనిసరి
- ఒకపూటే హాజరు వేస్తే సెలవు కింద లెక్క

వలేటివారిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు వీలు లేకుండా కూటమి ప్రభుత్వం నూతన చర్యలు తీసుకోనుంది. రెండుపూటలా సచివాలయాల్లో ముఖ హాజరు వేసేలా చర్యలు తీసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎప్పటి నుంచో ఈ హాజరు అమలులో ఇన్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. రోజులో ఏదో ఒక పూట హాజరు వేసుకొని వెళ్లి పోయేవారు. కానీ ఇప్పుడు ఈ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టనుంది. ప్రతి ఉద్యోగి రోజూ రెండుపూటలా హాజరు వేసుకోవాల్సిందే. ప్రభుత్వ పనివేళలు ఉదయం 10గంటలకు ఖచ్చితంగా సచివాయానికి చేరుకొని తమ యాప్‌లో ముఖ హాజరు వేయాలి. ఆ తరువాత సాయంత్రం 5గం టలకు యాప్‌లో ముఖహాజరు వేసుకున్న తరువాత ఇంటికి వెళ్లాలి. ఈ హాజరు కూడా సచివాలయ పరిధిలోని 500 మీటర్ల లోపే వేయాలి. ఎక్కడో కూర్చొని హాజరు వేసుకుందాంలే అన్నకుంటే వీలుకాదు. రెండుపూటలా హాజరు వేసుకుంటేనే ఆ ఉద్యోగి విధులకు హాజరు అయినట్లు పరిగణిస్తారు. ఇప్పటివరకు రోజులో ఒకపూట హాజరు వేసి సిబ్బంది వెళ్లిపోయేవారు. కొందరు విధులకు డుమ్మా కొట్టేవారు. ఇప్పటినుంచి ఆ పరిస్థితి ఉండదు.



వలేటివారిపాలెం గ్రామ సచివాలయం

ఒకటి నుంచే నూతన విధానం అమలు

ఈ నెల 1వ తేదీ నుంచి రెండుపూటలా యాప్‌లో ముఖ హాజరు పద్ధతిని అనుసరించాలని జిల్లా ఉన్నతాధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా ఆ సిబ్బంది కార్యాలయంలో ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారా లేదా అనేది వేచి చూడాలి. మండలంలో 15సచివాలయాలు ఉంటే ఒక్కొక్క సచివాయలంలో 11మంది చొప్పున్న 15సచివాయాల్లో 165మంది సిబ్బంది ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సగం మంది బదిలీలు అయ్యారు. వీళ్ల స్థానంలో ఎవరూ విధుల్లో చేరలేదు. దీంతో సచివాలయ్యాలో సగానికి పైగానే సిబ్బంది కొరత ఉంది.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు

బిట్రగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి పలుచోట్ల గురువారం దాడులు నిర్వహించారు. చెంచుల క్రీష్ణపురం శివారులో నాటుసారా తయారు చేస్తున్న కట్టా మనోహర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే సారా తయారీ ఉంచిన 50లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు.

స్లోప్ ర్యాంపు ఏర్పాటు



బిట్రగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావు పేట పంచాయతీ కొత్తూరులో ఈ నెల 10 న సీసీరోడ్డు వేశారు. అప్పటి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు స్థానికులే ఎవరి ఇళ్ల వద్ద వారు (స్లోప్) ర్యాంప్ ఏర్పాటు చేసుకుం టున్నారు. రోడ్డు వేసిన గుత్తేదారులు పట్టించుకోక పోవడంతో గరుసు తెప్పించుకుని వేసుకున్నట్లు చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- కే అంకమ్మ, ఉలవపాడు ఎస్ఐ



ఇంటర్వ్యూ...

ఉలవపాడు, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని ఎస్ఐ కే.అంకమ్మ తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన సదస్సులు ప్రజలను చైతన్యం చేస్తామన్నారు.

? లాఅండ్ ఆర్డర్ పరిస్థితి?

! జాతీయ రహదారిపై పలు రకాల నేరాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లను చాకచక్యంగా పట్టు కున్నాం. నకిలీ క్రైక్ ఇన్‌స్పెక్టర్, బైక్‌లపై వచ్చి వాహనదారుల ను మారణాయుదాలతో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్స్ విలువైన వస్తువులు అపహరిస్తున్న దొంగల ఆటలను కట్టడిచేస్తున్నాం.

? హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలేవి

! ప్రమదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆ ప్రదేశాల్లో క్యాషనరీ, సైన్ బోర్డులు, సోలార్ సిస్టమ్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశాం. రవాణాశాఖ, నేషనల్ హైవే అథారిటీ సమన్వయంతో ప్రమాదాలను అరికట్టే చర్యలు చేపడుతున్నాం.

? యువత పెడదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నారా ?

! యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నతపాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ చేపడుతున్నాం.

రైతులకు నీరందించాలి

లింగసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు కుడి కాలువ మరమ్మతు పనులను నిపుణులతో త్వరితగతిన చేయించి ఆయకట్టు రైతాంగానికి సకాలంలో నీరు అందించాలని వైసీపీ మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ అధికారులను కోరారు. గురువారం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ పనులను పరిశీలించారు. ఆయన వెంట తోకల కొండయ్య, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రెడ్డి, కళ్లగుంట ప్రసాదు, పెన్నా రమణయ్య, కిలారి సంతోష్ ఉన్నారు.

చెరువు అభివృద్ధికి కృషి

లింగసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపవని చెరువు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సాగునీటి సంఘం చైర్మన్ మల్లిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న స్థానిక శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, జనసేన నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. చెరువు ఆక్రమణలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటంకాలు తొలగించండి

కావలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 40వ వార్డులోని పంట కాలువ లో నీటిపారుదలకు ఉన్న ఆటంకాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ ఇంజనీరింగ్, శానిటరీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పంటకాలువను సందర్శించి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను చెత్తను పరిశీలించారు. ఆయనే దగ్గరుండి ఇంజనీరింగ్, శానిటరీ సిబ్బందితో కాలువలో పేరుకపోయిన వ్యర్థాలను కొంత మేర తొలగింపచేశారు.

నైపుణ్యతపై శిక్షణ

కావలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల కుటుంబసభ్యులకు నైపుణ్యతపై శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషియన్లు, ఏసీ, గ్రీజర్, టీవీ, రిఫ్రజరేటర్, వాషింగ్‌మిషన్ రిపేర్లు చేసేవారు బ్యూటీషియన్, పెయింటింగ్ తదితర సేవలందించే వారికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30వ తేదీ లోపు వివరాలను మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న మెప్మా ఆఫీస్‌లో అందజేయాలన్నారు. వివరాలకు సెల్:79013 11620, 94908 43600 నంబర్లను సంప్రందించాలని కోరారు.

జనసైనికులను తీసుకోవాలి

కావలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమస్యల పరిష్కారంలో 40వార్డుల జనసేన ఇన్‌చార్జిలను కూడా పరిగణనలో తీసుకుని ఆయా వార్డుల వివరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి 40వార్డుల జనసేన ఇన్‌చార్జి జాబితాను అందచేశారు.

ఎరువులు కొన్న రైతులకు రసీదు ఇవ్వాలి



సంగం: ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి శ్రీహరి



కలువాయి: తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ ఏవో ప్రతాప్,సిబ్బంది

అల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు దుకాణ యజమానులు రైతులు కొనుగోలు చేసిన మందులకు తగిన బిల్లును తప్పని సరిగా రైతులకు ఇవ్వాలని కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. మండలంలోని పలు ఎరువుల, పురు గు మందుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మండల సమావేశ మందిరంలో డీలర్లతో సమావేశం అయ్యారు. యూరియా అత్యధి ధరులకు విక్రయించినట్లు సమాచారం అందితే చర్యలు తప్పవని హెచ్చ రించారు. అలాగే యూరియా అన్ని సొసైటీల్లో అందుబాటులో ఉంచామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- కొండాపురం: యూరియాను అధిక ధరలకు అమ్మే ఎరువుల దుకాణ యజమానులపై చ ర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి షేక్ సైదా తెలిపారు. సొసైటీ, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణా లపై వీఏఏ, ఎమ్‌పీఈవోల పర్యవేక్షణ ఉంటుందన్నారు.
- కావలి రూరల్: అధిక ధరలకు ఎరువులను అమ్మే విధానాన్ని అరికట్టేందుకు ప్రతి ఎరువుల దుకాణానికి ఒక వ్యవసాయ సహాయకుడిని నియమించినట్లు మండల వ్యవసాయ అధికారి లలిత తెలిపారు. పట్టణంలోని 10ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలిం చారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.
- బిట్రగుంట: మండల వ్యవసాయఅధికారి విజయలక్ష్మీ 16ఎరువుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. బోగోలులో మన గ్రోమోర్, లక్ష్మీ ప్రన్న, విజయలక్ష్మీ రైతు డిపోలను పరిశీలించా రు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలులో రైతులకు ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఏఈవో అశోక్, వీఏఏలు ఉన్నారు.
- సంగం: స్థానిక బస్టాండ్‌లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి శ్రీహరి తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న యూరియా, పురుగు మందులు, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతి దుకాణంలో ఒక వీఏఏను నియమించినట్లు తెలిపారు. యూరియా కావలసిన రైతులు వీఏఏ దగ్గర పర్మిట్ రాయించుకుని తెచ్చుకోవచ్చునన్నారు. పర్మిట్ లేకుండా యూరియా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. అదేవిధంగా ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ వసూలు చేసినట్లు ఫిర్యాదులందితే విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట వీఏఏలు ఉన్నారు.
- కలువాయి: రైతులకు ఎమ్మార్పీ ధరకే యూరియా సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రతాప్ తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరఫరాలో ఇబ్బందులు ఉంటే 833105728, 8331057184, 8331057204 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.



అల్లూరు: పురుగు మందుల దుకాణంలో విచారణ జరుపుతున్న ఏడీఏ నాగరాజు



కావలి: ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో లలిత

న్యూస్ బాక్స్

ప్రతి ఒక్కరికీ 'ఆధార్' తప్పనిసరి

ఆత్మకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :ప్రతిఒక్కరూ తప్పని సరిగా ఆధార్‌కార్డు కలిగి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు తెలిపారు. గురువారం ఆయన కరటంపాడులోని ఎస్టీ కాలనీని సందర్శించి ఆధార్‌కార్డు లేని ఎస్టీ కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం ఆయన ఆధార్‌కార్డు లేని 40మంది ఎస్టీలను బట్టేపాడులో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌కు తీసుకెళ్లి దరఖాస్తు చేయించి సమస్యలను పరిష్కరించారు.

రుచికరమైన భోజనం అందించాలి

ఉదయగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం సర్వరబాదు, నేలటూరు ప్రాథమిక పాఠశాల లను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేయడంతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయం పరిశీలన

వింజమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని గురువారం నెల్లూరుజిల్లా ఏపీసీ వెంకటసుబ్బయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని పాఠశాలల వివరాలు అడిగి తెలసుకున్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ఎంమధుసూదన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు

సంగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సరస్వతీ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాడి రైతులు తగుజాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గేదెలు, రెండేళ్లలోపు దూడలు గొంతువాపు, గురక, పచ్చి కదొమ్మ వ్యాధుల బారినపడి మృతిచెందే ప్రమాదముందన్నారు. అలాంటి రైతులు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే టీకాలను తమ గేదెలకు వేయించుకోవాలని కోరారు.

మోడల్ టెస్ట్ పేపర్ల కరదీపిక ఆవిష్కరణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్),డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని యూటీఎఫ్ రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్ల కరదీపికను గురువారం పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చలపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాఖా జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కరదీపిక ఎంతగానో తోడ్పాటునందిస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలతోపాటు కరదీపికలోని అంశాలపై దృష్టిసారిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, గోపి, జలీల్‌సుల్తాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రారంభం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఏపీ రీ సర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గురువారం భాస్కరాపురంలో సర్వే ప్రక్రియను ప్రారంభించినట్లు తహసీల్దారు హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎలాంటి లోపాల్లేకుండా పక్కాగా సర్వే కొనసాగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

అన్న క్యాంటీన్లకు అపూర్వ ఆదరణ

ఆత్మకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లకు అపూర్వ ఆదరణ లభిస్తోందని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆత్మకూరు అన్నకాం టీన్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలిం చారు. కార్యక్రమంలో దర్గా కమిటీ మాజీ చైర్మన్ షేక్ హయత్‌బాష, క్యాంటీన్ సూపర్వైజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆత్మకూరు: అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

అభివృద్ధి చేసే ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే ఊరుకోం

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడికాలువ స్టాప్‌లాక్ గేటు వ్యవహారంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ విమర్శలు చేయటం తగదని టీడీపీ నేతలు మండిపడ్డారు. బాధ్యతలేకుండా ఆధారాలు లేని విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గురువారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ మండలాధ్యక్షులు జనిగర్ల నాగ రాజు, రాళ్లపాడు ప్రాజెక్టు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20రోజులుగా ఎమ్మెల్యే ఇంటూరి రేయింబవళ్లు గేటు మరమ్మతుల కోసం శ్రమించి నీరందించారని గుర్తు చేశారు. సమస్య పరిష్కా రానికి సలహాలు ఇవ్వాల్సింది పోయి ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్రం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీన రసింహ, కమిటీసభ్యులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న నేతలు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

వింజమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసైన్‌మెంట్ భూములను కొనడం, అమ్మడం నేరమని, నియోజకవర్గవ్యాప్తంగా 700రెవెన్యూ సమస్యలు నా దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం శంకవరం పంచాయతీ వెంకటాద్రిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాలయం స్లాబు నిర్మాణానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. బీసీలు నిర్మించుకుంటున్న ఈ రామాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి సుమారు రూ.10లక్షలు ఎండోమెంట్ ద్వారా నిధులు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ భూములను పట్టాలు పొంది అమ్ముకున్నారని ఎమ్మె ల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, శంకవరం, వెంకటాద్రి పాలెం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): నార్త్ కొండాయపాళెం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దారు హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు పంపిణీ చేసినప్పటికీ అసైన్‌మెంట్‌గా బదలాయింపు చేయలేదని కొందరు రైతులు వాపోయారు. ఐదు విడతల భూ పంపిణీలో పట్టాలు పొందినా తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని వినతిపత్రాలు అందించారు. వీటికితోడు ధర్మవరం గ్రామ నిర్మాణ ప్రాంతాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు. విరువూరులోనూ డీటీ చెంచయ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

- సంగం: పడమటిపాళెంలో గురువారం తహసీల్దారు సోమ్లా నాయక్ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించి స్థానిక అధికారులతో చర్చించి రికార్డులు పరిశీలించారు. నిర్దేశించిన గడువు లోపు సమస్యలు పరిష్కరిస్తామని రైతులకు తెలిపారు. ఆర్ఐ రాజనారాయణ, సర్వేయర్ శివరంజని, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపడితే పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయా ధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం సోమలరేగడ గ్రామంలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో తెగుళ్లను గుర్తించి వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు సర్వోజీ, శేషగిరి, చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబాల దివస్

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞాన్‌విహార్ ఉన్నత పాఠశాలలో ని ర్వహించిన వీర బాలదివస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ ఖండ సంఘచాలక్ తన్నీరు మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరులైన జోరావర్ సింగ్, ఫతేసింగ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టుమనేని హరిబాబు, నాయకులు మన్నే పల్లి వరప్రసాదరావు, చుండి మురళీధర్, గొడ్డటి బాలరాఘవ యాదవ్, భూషయ్య పాల్గొన్నారు.



వీరబాలురకు నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు

బాలదివస్‌పై అవగాహన

వలేటివారిపాలెం: నేకునాంపురం అంగన్‌వాడీ కేంద్రం -2లో గురువారం కందుకూరు ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట వీర బాలదివస్ కార్యక్రమంపై గర్భవతులు, బాలింతలు, చిన్నారుకు అవగాహన కల్పించారు. సిక్కుల పదో గురువు గురు గోవిదసింగ్ కుమారులు ఫత్‌సింగ్, జూరావర్‌సింగ్ ధైర్యానికి, సాహసానికి చిహ్నంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, మహిళా పోలీస్ ప్రసన్న టీచరు భారతీలక్ష్మీ తదితరలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ రెవెన్యూ పరిధిలో 200 ఎకరాల ప్రభుత్వ భూములను పక్క గ్రామాలకు చెందిన కొందరు ఆక్రమించి పట్టాలు పొందారని గురువారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సుబ్రహ్మకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర గ్రామస్థుల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలను రద్దు చేసి తమ గ్రామంలో అర్హులైన వారికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు భూ, ఇతర సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో పెంచలయ్య, పాల్గొన్నారు.

- దుత్తలూరులో: సోమలరేగడలో తహసీల్దారు నాగరాజు సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణన సర్వే వివరాల ప్రదర్శన

సంగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇటీవల చేసిన ఎస్సీ కుల గణన సర్వే వివరాలను మండలంలోని అన్ని సచివాలయాల్లో అధికారులు ప్రదర్శించారు. అందులో భాగంగా సంగం 12 సచివాలయాల్లో ఏఎస్‌డబ్ల్యూవో బ్రహ్మానందచారి సర్వే జాబితాను నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ఆయా గ్రామాల పరిధిలోని ఎస్సీ కుల గణన సర్వే వివరాలను సంబంధిత సచివాలయ నోటీస్ బోర్డులో కార్యదర్శు లు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉంచారు.

సమస్యల పరిష్కారానికి కార్మికుల ధర్నా

కావలి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువా రం మున్సిపల్ కార్మికులు స్థానిక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణ మోహన్ మాట్లాడారు. 16రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్న ఒప్పందాన్ని ఇప్పటి వరకు చేయలేదన్నారు. కార్మికులకు రూ.7లక్షల ప్రమాదబీమా, దహన సంస్కారాలకు రూ.20వేలు, విధుల నిర్వహణ వయసు 62ఏళ్లకు పొడిగిం చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవా ధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, తురకా శీనయ్య, ఒంగోలు రమేష్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

ఔట్‌పోస్టుపై ఆశలు

ధనలక్ష్మీపురంలో 11 ఏళ్లుగా మూతపడ్డ పోలీసు కేంద్రం

'తూర్పు'న పెరుగుతున్న నేరాలు

తాజాగా ఎస్పీ ప్రకటనతో కదలిక

నెల్లూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరానికి తూర్పున ఉన్న ధనలక్ష్మీపురంలోని పోలీసు ఔట్‌పోస్టు మళ్లీ తెరుచుకుం టుందన్న ఆశలు ఆ ప్రాంత వాసుల్లో చిగురిస్తున్నాయి. ఇక్కడ ఉన్న ఔట్ పోస్టు 11 ఏళ్ల క్రితం మూడపడింది. కొంతకాలంగా ఈ ప్రాంతంలో నేరాలు పెరగడం, ప్రమాదాలు అధికం కావడంతో ఔట్‌పోస్టును పునరుద్ధరించాలని స్థానికులు, నాయకులు కోరుతూ వస్తున్నారు. ఇటీవల ధనలక్ష్మీపురంలో పర్యటించిన ఎస్పీ కృష్ణకాంత్ ఔట్‌పోస్టు విషయంలో సానుకూల ప్రకటన చేయడంతో త్వరలో ఔట్‌పోస్టు సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశిస్తున్నారు.

● ఒక్కటే స్టేషన్

సుమారు 15 ఏళ్ల క్రితం నెల్లూరు నగరంలో విలీనమైన 14 గ్రామాలు, ప్రస్తుతం నెల్లూరు రూరల్ మండలంలో ఉన్న 18 గ్రామాలకు కలిపి పోలీసు స్టేషన్ ఒక్కటే. నగరానికి తూర్పు, పడమర ప్రాంతాల్లో విస్తరించిన ఈ గ్రామీణ ప్రాంతాలన్నింటిలో శాంతి భద్రతలను రూరల్ పోలీసు స్టేషన్ ఒక్కటే పర్యవేక్షిస్తోంది. ఈ స్టేషన్ పరిధి ఎక్కువ కావడంతో నేరాల నియంత్రణకు 2010లో అప్పటి ఎస్పీ దామోదర్ ధనలక్ష్మీపురం వద్ద పోలీసు ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. నగరానికి తూర్పునున్న రూరల్ ప్రాంతాలన్నింటినీ దీని పరిధిలోకి చేర్చి ఎస్ఐ, కానిస్టేబుళ్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. 2013 వరకు బాగానే సాగిన ఈ ఔట్‌పోస్టుపై ఆ తర్వాత ఉన్నతాధికారుల పర్యవేక్షణ క్షీణించింది. దీంతో 11 ఏళ్లుగా పోలీసు సేవలు నిలిచిపోయాయి. దీనికితోడు ఔట్‌పోస్టు భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.



ధనలక్ష్మీపురంలోని పోలీసు ఔట్‌పోస్టు పాత భవనం

● పెరిగిన నేరాలు

పరిధి ఎక్కువ కావడానికితోడు ఏడాదికేడాదికి పెరుగుతున్న దొంగతనాలు, పోకిరీల ఆగడాలు, రాత్రుళ్లు అభద్రత, తరుచూ ప్రమాదాలు, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు భారంగా మారింది. ఈ తరుణంలో ధనలక్ష్మీపురం ఔట్‌పోస్టు అవసరం ఏర్పడింది. నెల్లూరు నగరానికి తూర్పునున్న కొడూరు పాడు, నవలాకులతోట, నారాయణ రెడ్డిపేట, గుడిపల్లిపాడు, పెద్దచెరుకూరు, వావిలేటిపాడు, చింతారెడ్డిపాళెం, సౌత్‌రాజుపాళెం, ధనలక్ష్మీపురం, గుండ్లపాళెం, కనుపర్తిపాడు, కల్లూరుపల్లి ప్రాంతాలు ఒకప్పుడు ఔట్‌పోస్టు పరిధిలో ఉండేవి. వీటిల్లో ప్రస్తుతం పోలీసు సేవలు ప్రజలకు అందుతున్నప్పటికీ వేగంగా అందే పరిస్థితి లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నెల్లూరు - ముత్తుకూరు, షైపాడు, కోడూరు రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముత్తుకూరు మార్గంలో పరిశ్రమలు పెరగడంతో వాహనాల రాకపోకలు కూడా అధికమయ్యాయి. ఇక, కనుపర్తిపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్య ఇప్పటికీ పోలీసులకు సవాల్‌గానే ఉంది. అంతేకాదు, ధనలక్ష్మీపురం చుట్టుపక్కల ఉన్న అనేక విద్యా సంస్థలకు భద్రత కరువవుతోంది. ఈ నేపథ్యంలో ఔట్‌పోస్టు పునరుద్ధరణ అనివార్యమన్న అభిప్రాయం అన్ని వర్గాల్లో వ్యక్తమవుతోంది.

కోదండరాముడి సేవలో అరవక్కోట్టై పీఠాధిపతి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 26: (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయాన్ని గురువారం శ్రీరంగంలోని శ్రీమద్ అరవక్కోట్టై 11వ పీఠాధిపతి చిన్న ఆండవన్‌స్వామి సందర్శించారు. ఆలయ పండితులు, అర్చకులు, వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో స్వామీజీ శిష్యబృందం, దొడ్ల కోదండరామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



కోదండరామస్వామి దర్శనానికి వెళ్తున్న చిన్న ఆండవన్‌స్వామి

ఘనంగా వీర్ బాల్ దివస్



వెంకటాచలం: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఎస్‌యూలో గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వీర్ బాల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ముందుగా వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, రాజేశ్వరి, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, అశోక్ నాయుడు, విజయశ్రీ, డాక్టర్ ఓబులపతి, డాక్టర్ శంకర్ ఉన్నారు.

జగదేవిపేటలో..

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేటలో జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని గురువారం ఎన్జీ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతూ శిక్షణ పొందుతున్న విద్యార్థినుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రఘునాధ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ లోకేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ హెడ్ శైలజ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగదేవిపేట ఉపసర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, కూకటి వెంకటేశ్వరరెడ్డి, దేగపూడి శ్రీనివాసరెడ్డి, పామూరు సుధాకర్‌రెడ్డి, రాజయ్య, గ్రామ రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

మండలంలోని కొత్తూరు బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాలదివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఫతేసింగ్, జోలావర్‌సింగ్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పిన్న వయసులోనే దేశం కోసం, ధర్మం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమై మొఘులల చేతుల్లో సజీవ సమాధి గావించబడిన మహావీరులని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ గాంధీ, వాకాటి ప్రసాద్, అత్తిపాటి శ్రీధర్, నాగూరు శివరాం, తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో పొటాష్ వాడకం తగ్గించాలి



పడుగుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కోవూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో పొటాష్ వాడకాన్ని తగ్గించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత రైతులకు సూచించారు. పడుగుపాడులో గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పొటాష్ వినియోగం ఎక్కువైతే భాస్వరం ఉత్పత్తి కావడంతో పొలంలో జింకు లోపం తలెత్తుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వీఏఏలు చైతన్య, మౌనిక పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధి కారిణి ఇందిరావతి తెలిపారు. ఆమె సిబ్బందితో కలిసి ఆమె మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు ఓ బస్తా యూరియాను వ్యవసాయ శాఖ తరపున విక్రయిస్తున్నట్లు వివరించారు. ఎరువుల దుకాణాలు, పీఏసీసీల్లో పట్టాదారు పాసుపుస్తకం తీసుకువెళ్లి యూరియాను పొందాలన్నారు. పంట తొలిదశలో రైతులు లావు యూరియాను వినియోగించాలన్నారు. యూరియా కొరత లేదన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ

పొదలకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే యూరియా, ఇతర ఎరువులను అమ్ముతున్నట్లు వ్యవసాయ శాఖ పొదలకూరు ఏడీఏ శివనాయక్ తెలిపారు. గురు వారం పట్టణంలోని పలు ప్రైవేటు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘం, ప్రైవేటు డీలర్ల వద్ద మండలంలో విరివిగా ఎరువులు ఉన్నాయన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వాసు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏవోలు

● ముత్తుకూరు : మండల రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి జోత్స్నారాణి తెలిపారు. గురువారం స్థానికంగా ఉన్న పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మండలంలో ఈ సీజన్‌లో 7వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారని తెలిపారు. ఇప్పటివరకు సొసైటీలు రైతుసేవా కేంద్రాలతో 750 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. శుక్రవారం మరో వంద టన్నుల యూరియా సొసైటీలకు వస్తుందన్నారు. ఎరువుల దుకాణంలో పురుగు మందులు ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని సూచించారు.



ఉపన్యసిస్తున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

విద్యతోనే ఉజ్వల భవిత

వెంకటాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చదువు ఒకటే విద్యార్థుల భవిష్యత్తును మార్చగలదని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డీనేటర్ వెంకటసుబ్బయ్య సూచించారు. గొలగమూడి సమీపంలోని టూరిజం కళాశాలలో గురువారం ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ అధికారి జీ సుధీర్‌బాబు, మండల విద్యాశాఖాధికారి మధుసూదన్, సీఆర్ఎంటీ మస్తానయ్య తదితరులున్నారు.

'బడుగులకు అండగా ఉంటాం'

ముత్తుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండ గా ఉంటామని సీపీఐ మండల కార్యదర్శి తుంగ ఏడుకొండలు తెలిపారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక కూడలిలో పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. పేదల సమస్యలపై పోరాటాలకు సిద్ధం గా ఉంటామన్నారు. ప్రధానంగా భూ సమస్యలపై అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో సభ్యుల సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా, కార్మిక సమస్యల పోరాటంలో సీపీఐ ముందు ఉంటుందని ప్రజలు పార్టీకి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కొమారి నందయ్య, వెంకటరమణయ్య, ముజఫర్, వెంకటశేషయ్య, బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

బీసీలు ఇప్పుడు గుర్తుకొచ్చారా? : గుమ్మడి

వెంకటాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గుర్తుకురాని బీసీలు ఇప్పుడు నీ అనుచరుడు మండల వెంకటశేషయ్యపై బీసీ మహిళ లైంగిక దాడి కేసు పెట్టేసరికి గుర్తుకొచ్చారా అంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేత కోడూరు ప్రదీప్‌రెడ్డి చెప్పాడని నాపై 20కి పైగా అక్రమ కేసులు బనాయించి రౌడీషీట్ పెట్టించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ అని ఏ కులాన్ని విడిచి పెట్టకుండా అందరిపై అక్రమ కేసులు పెట్టించిన చరిత్ర కాకాణిదే అన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, చెంచురామయ్య, అశోక్, రాజేష్, వంశీ, అమర్నాథ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రత్నం జయరాంకు నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం చైర్మన్ రత్నం జయరామ్ ఉత్తరక్రియలు గురువారం జరిగాయి. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, రాజరాజేశ్వరి దేవస్థానం ఈవో కోవూరు జనార్దన్ రెడ్డి, అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.



భూముల రీసర్వేతో సమగ్ర వివరాల నమోదు



నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

నెల్లూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్న భూముల రీసర్వేతో భూయజమానుల సమగ్ర వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తామని నెల్లూరు రూరల్ తహసీల్దారు లాజరస్ తెలిపారు. గురువారం మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో ఎప్పుడూ చేర్పులు, మార్పులు జరుగుతుంటాయన్నారు. వీటిని సమగ్రంగా సేకరించి రికార్డుల్లోకి ఎక్కిస్తే సమస్యలు చాలా వరకు పరిష్కారం అవుతాయని తెలిపారు. గ్రామసభలు, అధికారుల పర్యటనలు జరిగినప్పుడు తగిన వివరాలు అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ మాధవి, సర్పంచ్ పోలయ్య, ఉపసర్పంచ్ చల్ల నరసయ్య, వీఆర్వో శ్రీహరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●మనుబోలు: పిడూరు రెవెన్యూ గ్రామంలో గురువారం అధికారులు ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలతో రీసర్వే ప్రారంభిస్తామని, ఎలాంటి పొరపాట్లు లేకుండా రైతులకు మేలుజరిగేలా రీసర్వే చేపడ తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనువాసులు, గ్రామ ఇన్‌చార్జి సర్పంచు తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి,ఆర్ఐ. నారాయణ, వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్ల బృందం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య మాట్లాడుతూ వివిధ కారణాలతో మరణించిన 29 మంది కార్మికుల వారసులకు ఉద్యోగాలు, నష్టపరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న కార్మికులకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. వర్షాల్లోనూ పని చేస్తున్న పారిశుధ్య కార్మికు లకు రెయిన్ కోట్లు అందచేయాలన్నారు. గత సమ్మె ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజకు వినతి పత్రాలు అందచేశారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్మికులు

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం

మనుబోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బద్దెవోలు పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11మంది భూసమస్యలపై ఫిర్యాదు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య, శానంపూడి సురేం ద్రరెడ్డి, సర్వేయర్ శ్రీనువాసులు, విఆర్‌వో శ్యామ్‌బాబు పాల్గొన్నారు.



రైతుల అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బయ్య

గ్రిద్దలూరులో ...

● సైదాపురం: మండలంలోని గ్రిద్దలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, భూ సర్వే, రేషన్ కార్డుల మంజూరు పలు సమ్యలపై తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు, రేషన్ కార్డు మంజూరు, పలు సమస్యలపై 60 వినతి పత్రాలు వచ్చాయన్నారు. వినతి పత్రాలు పరిశీలించి త్వరితగతిన భూసమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖరేన్ద్ర సరస్వతి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అతి సామాన్యులను కూడా దగ్గరకు తీసుకుని తన మహిమలు చూపిన యతీశ్వరుడు, కారణజన్ముడు చంద్రశేఖరేన్ద్ర సరస్వతి స్వామి అని సాహితీవేత్త అగస్త్యరాజు వెంకట సుబ్బారావు అన్నారు. గురువారం పొగతోట ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో చంద్రశేఖరేన్ద్ర సరస్వతి 31వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి విశేష పూజలు జరిపారు. రాత్రి జరిగిన ఆధ్యాత్మిక సభలో సుబ్బారావు మాట్లాడుతూ చంద్రశేఖరేన్ద్ర సరస్వతిని భక్తులు నడిచే దైవంగా ఆరాధిస్తారని తెలిపారు. ఆయన 13వ ఏటనే కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారని, 87 ఏళ్ల పీఠాన్ని పాలించారంటూ స్వామిజీ జీవిత విశేషాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరేన్ద్ర సరస్వతి ట్రస్ట్ వ్యవస్థాపకుడు జంగా శివకుమార్, చక్రాల ఆనంద్ కుమార్, పొందులూరు శివప్రసాద్, లక్ష్మీకామాక్షి, జీ రామగోపాల్, పీ నరసింహారావు, కోట రాజశేఖర్, సూరం చంద్రశేఖర్, ట్రస్ట్ మేనేజర్ సమయానందనాథ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఉపన్యసిస్తున్న అగస్త్యరాజు సుబ్బారావు, పక్కన ఆనందకుమార్, సమయానందనాథ

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిద్దాం

నెల్లూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిద్దామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. ఆమెను అల్లీపురం పీహెచ్‌సీ వైద్యులు హజరత్‌రెడ్డి, బలరాంనాయక్ గురువారం జిల్లా కార్యాలయంలో మార్యదపూర్వకంగా కలిశారు. ప్రజలకు వైద్యసేవలను, ప్రభుత్వ పథకాలను అందచేయాలని ఆమె సూచించారు. త్వరలో పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు.



డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న వైద్యులు

న్యూస్ బాక్స్

విశ్రాంత అధ్యాపకుడు జోజికి డాక్టరేట్

నెల్లూరు(విద్య), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కమతం జోజికి తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ది లీడర్‌షిప్ రోల్స్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏ స్టడీ అనే అంశంపై జోజి చేసిన పరిశోధనకు ఎస్‌వీయూ డాక్టరేట్ ఇచ్చింది. వర్సిటీ పొలిటికల్ సైన్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ బీవీ మురళీధర్ పర్యవేక్షణలో తాను పరిశోధన పత్రాలు సమర్పించానని జోజి తెలిపారు.

తెలుగు రచయితల మహాసభకు 'గండికోట'కు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శనివారం నుంచి రెండు రోజులు జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కు ఆహ్వానం అందింది. ఆ మహాసభలలో పాల్గొనే అవకాశం కల్పించిన నిర్వాహకులకు గండికోట ధన్యవాదములు తెలిపారు.

బీజేపీ చిన్నబజారు మండల అధ్యక్షుడిగా హేమంత్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ చిన్నబజారు మండల అధ్యక్షుడిగా పీ హేమంత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఆ మండల అధ్యక్ష ఎన్నికను గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి సామంచి శ్రీనివాస్, నెల్లూరు జిల్లా ఎన్నికల అధికారి భాస్కర్ గౌడ్ ఈ ఎన్నికలు నిర్వహించగా బూత్ అధ్యక్షులు అందరూ కలిసి హేమంత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, నాయకుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం నేత ఖాదర్‌బాషా సంస్మరణ సభ

కోవూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన సీపీఎం పట్టణ నాయకుడు ఖాదర్‌బాషా సంస్మరణ సభ శుక్రవారం జరుగుతుందని ఆ పార్టీ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి గండవరపు శేషయ్య తెలిపారు. మండబయలు కూడలిలోని సీతా పోలయ్య భవనంలో సంస్మణ సభ జరుగుతుందన్నారు. సీపీఎం, ఆవాజ్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావల్సిందిగా ఆయన కోరారు.

బోర్ మోటారుకు మరమ్మతులు

విడవలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముదివర్తి గ్రామ పంచా యతీ గాంధీగిరిజన సంఘంలో గత నాలుగు రోజులుగా బోరు మరమ్మతు లకు గురికావ డంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పలుమార్లు పంచాయతీ పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోక పోవడంతో స్థానికులే గురువారం మరమ్మ తులు చేయించు కున్నారు. వారికి మద్దతుగా ఉప సర్పంచ్, ఆ వార్డు సభ్యులు నిలిచారు.

కొండాయపాళెంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాలెంలో గల ఎరుకులపాలెం కాలనీలో 50 మంది నిరుపేద వృద్ధులకు అబైండింగ్ హోప్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. పెట్ల జోషువా, మరలిన్, జోలిన్, విలియమ్స్, డైరెక్టర్ ఎం బైటస్ నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలిసగం అంతులేని రాచకం

2024 చీకటి వెలుగులు

మలిసగం అభివృద్ధికి అడుగులు






తాము ఏది అనుకుంటే అందే జరగాలనే అహంకారం., జరిగి తీరాలనే దబాయింపు... ఎదురు తిరిగితే దౌర్జన్యం.. కేసులు.. ఐదేళ్లూ రాజకీయమంటే ఇదే అని నమ్మి ఆచరించారు నాయకులు. పోలీసులు సాగిలపడడం.. అధికార యంత్రాంగం తలవంచడం.. తమ బలం అనుకున్నారు. ప్రజల మౌనం తమ పాలనకు అంగీకారంగా భావించారు. భయం కూడా ఒక్కోసారి మౌనాన్నే ఆశ్రయిస్తుంది. అది బ్యాలెట్ పెట్టెల్లోనే బద్దలైంది. విదిలిస్తే చాలు పడివుంటారను కున్న జనమే ఓడించి గుణపాఠం చెప్పారు. 2024 తొలిసగకాలంలో విర్రవీగి చెలరేగిన నాయకులంతా మలిసగకాలంలో మన్నుతిన్న పాముల్లా మిగిలిపోయారు. ఓడలు బండ్లయిన ఈ విచిత్ర స్థితిని వీక్షిస్తున్నారు ప్రజలు. ఓడిన నేతలనే కాదు.. గెలిచిన నాయకుల తీరునూ గమనిస్తున్నారు. 2024 విభిన్న పార్శ్వాల సమాహారం...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి.. ఊపిరి పీల్చుకుంది!

తొలిసగం: విలువలన్నవి మాటల్లో కట్టే కోటలేగానీ ఆచరణలో అంతా ఒకటే అని తిరుపతి వైసీపీ నాయకులు రుజువు చేశారు. ఎన్నికలకు ముందు వీరి అసహనం హద్దుమీరింది. అభివృద్ధి పేరుతో అవినీతికి రాచబాటలు వేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో టీడీఆర్ బాండ్ల మాయాజాలం జరిగిందనే విమర్శలు భగ్గుమన్నాయి. అలాగే టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి తీసుకున్న నిర్ణయాల మీదా ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా తిరుపతికి భారీగా స్వామి నిధులను కేటాయించిన తీరు, అవసరం లేకపోయినా స్విమ్స్ భవనాలు, సత్రాల నిర్మాణం వంటి వాటి వెనుక భారీ కమీషన్ల కతలున్నాయనే ప్రచారం జరిగింది. తిరుపతి ప్రజల ఆరాధ్య దైవం గంగమ్మకూ అపచారం జరిగిందనే అంశం వైరల్ అయ్యింది. 2024 ప్రథమార్థంలో భూమన కుటుంబం తిరుపతి రాజకీయాలను శాసించింది. ఎదురుచెప్పే ధైర్యం ప్రత్యర్థులకే కాదు సొంతపార్టీ నేతలకూ కూడా లేని వాతావరణం నెలకొంది. దాని ఫలితం ఎన్నికల్లో చాచి కొట్టినట్టుగా వెల్లడైంది. రాజకీయ సన్యాసం అని ప్రకటించిన భూమనకూ, ఉజ్వల భవిష్యత్తు ఆశలతో తిరుపతి శాసనసభకు పోటీ చేసిన ఆయన తనయుడు భూమన అభినయరెడ్డికీ తీవ్ర అసంతృప్తినే 2024 మిగిల్చింది.



మలిసగం: తిరుపతి తెరమీదకు అనూహ్యంగా వచ్చిన ఆరణి శ్రీనివాసలు ఎన్నికల సమయంలో సొంతగూటి నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నా.. నెమ్మదితనంతో నిలదొక్కుకున్నారు. కూటమి నేతలందరినీ ఒక తాటిమీదకు తీసుకురాగలిగారు. జనసేన ఎమ్మెల్యేగా భారీ విజయాన్ని సాధించిన ఆయన వ్యవహార శైలి.. మునుపటి అధికార నాయకుల శైలికి పూర్తిగా భిన్నమైనది. దురుసుతనం, అహంకారపూరిత ధోరణి లేవు. దీంతో కబ్జాలు, వసూళ్లతో ఎడాపెడా చెలరేగిపోయిన చోటామోటా నాయకులను చవిచూసిన తిరుపతి నగర ప్రజలకు ఊపిరి పీల్చుకునే విరామం అయితే 2024 మలిసగం ఇచ్చింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో వుంటున్నారు. అయితే నియోజకవర్గంపై ఇంకా పట్టు సాధించలేదు. అధికారులూ ఎమ్మెల్యే మాట వినడం లేదని అనుచరవర్గం అసంతృప్తిగా వుంది. కుటుంబ సభ్యుల జోక్యంపైనా విమర్శలున్నాయి. ఎమ్మెల్యే పేరు చెప్పుకొని కొందరు అనుచరులు తిరుమలలో అక్రమ తట్టలు మొదలుకుని తిరుపతిలో వసూళ్ల వరకూ దందాలు నెమ్మదిగా మొదలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి.

చంద్రగిరిలో ఫలించని సంక్షేమం

తొలిసగం: 2024- చంద్రగిరి రాజకీయాల్లో పెనుమార్పులకు సాక్ష్యంగా నిలచింది. ఐదేళ్లపాటూ పెట్టిన శ్రద్ధా.. పెట్టుకున్న ఆశలూ కల్లలయ్యాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పార్టీ కే పరిమితం అవుతానంటూ కుమారుడు మోహిత్‌రెడ్డిని తెరమీదకు తీసుకువచ్చారు. అయితే అనూహ్యంగా ఆయనే ఓంగోలు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగాల్సివచ్చింది. దీంతో పటిష్టమైన కోటగా చెవిరెడ్డి భావించిన చంద్రగిరి రాజకీయాలు మారిపోయాయి. టీడీడీ అభ్యర్థిగా పులివర్తి నాని దూకుడు పెంచారు. ఆయన భార్య సుధారెడ్డి స్థైర్యం, రాజకీయ వ్యూహం వైసీపీని కలవరపెట్టాయి. జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలు ఈ నియోజకవర్గంలోనే చోటు చేసుకున్నాయి. పోలింగ్ తర్వాత నాని మీద జరిగిన దాడి రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. మొత్తంమీద వ్యక్తిగత తాయిలాలతో మాత్రమే విజయం సాధ్యం కాదని చంద్రగిరి నిరూపించింది. అటు ఒంగోలులోనూ చెవిరెడ్డి ఓటమి పాలయ్యారు. తన మకాం ఏకంగా బెంగళూరుకే మార్చేశారు.

మలిసగం: చంద్రగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాని ఎన్నికల ముందటి దూకుడు తగ్గించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులమీద దృష్టి పెంచారు. అయితే రాజకీయంగా మాత్రం ప్రత్యర్థిపై తీవ్రతను ఆయన తగ్గించలేదు. జనానికి, శ్రేణులకు అందుబాటులోనే ఉంటున్నారు. ఇదే సమయంలో ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా ఆయన కుటుంబీకులు తమకు తాముగా పరిమితులు విధించుకోవడం విశేషం.

శ్రీకాళహస్తిలో కబ్జాల కలకలం తగ్గింది

తొలిసగం: శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాటే శాసనంగా ఐదేళ్లూ నడిచింది. ఎన్నికలకు ముందు కాలంలోనూ ఇదే కొనసాగింది. జనంతో నిత్యం మెలిగే నాయకుడనే పేరున్నా.. భూదందాల ఆరోపణలు హోరెత్తిపోయాయి. పోలీసులూ, అధికార యంత్రాంగం ఆయన మాట జవదాటలేదనే విమర్శలను మూటగట్టుకున్నాయి. ముక్కంటి ఆలయ వ్యవహారాల్లో ఆయన మితిమీరిన జోక్యం.. తీవ్ర చెడ్డపేరును మిగిల్చింది. అనుచరుల పగ్గాలు వదిలేసి అవినీతితో ఆలయాన్ని భ్రష్టుపట్టించారనే ఆరోపణలు వచ్చాయి. ఓటమి తర్వాత నిశ్శబ్దంగా ఉండిపోయిన మధుసూదనరెడ్డి ఇటీవల అధికారులపై విరుచుకుపడి మళ్లీ వార్తల్లోకి వచ్చారు.

మలిసగం: బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడిగా సుధీర్‌రెడ్డికి శ్రీకాళహస్తి జైకొట్టింది. ఆయన కూడా గెలిచాక ప్రజలకు, కేడర్‌కు అందుబాటులో వుంటున్నారు. అయితే కార్యకర్తలైనా, ప్రజలైనా చనువుగా ఆయన దగ్గరకు వెళ్లలేకపోతున్నారు. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ కొందరు అక్రమ దందాలకు దిగుతున్నారు. వారిని కట్టడి చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. సొంత పార్టీలోనూ, కూటమిలోనూ ఉన్న సీనియర్ నాయకులతో కలివిడిగా ఉండడం లేదనే విమర్శలున్నాయి. శ్రీకాళహస్తి ఆలయ వ్యవహారాల్లోనూ అనుచరవర్గం జోక్యం నెమ్మదిగా పెరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.



వైసీపీ ఉనికి చాటిన గురుమూర్తి



ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో వైసీపీ తరపున పోటీ చేసిన వారిలో గెలిచిన ఏకైక అభ్యర్థి గురుమూర్తి మాత్రమే. తిరుపతి సిట్టింగ్ ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేసి రెండవసారి గెలిచారు. జిల్లా పరిధిలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్ళూరుపేట, గూడూరు, నగరి, వెంకటగిరి అసెంబ్లీ అభ్యర్థులంతా పరాజయం పాలయ్యారు. గురుమూర్తి ఒక్కరే వైసీపీ ఉనికి కాపాడారు. నెమ్మదస్తుడిగా పేరున్న ఆయన జిల్లా అభివృద్ధి పనుల కోసం ఢిల్లీలో తరచూ అధికారులను కలుస్తుంటారు.

వైసీపీ దళిత ఎమ్మెల్యేలకు చేదు అనుభవం

తొలిసగం: జిల్లాలో ఈ ఏడాది తొలి నాలుగు నెలలూ వైసీపీ దళిత ఎమ్మెల్యేలు ముగ్గురూ సొంత పార్టీ నుంచి చేదు అనుభవం ఎదుర్కొన్నారు. సత్యవేడులో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి అసెంబ్లీ టికెట్ నిరాకరించింది అధిష్టానం. మంత్రి పెద్దిరెడ్డి కాళ్లకు మొక్కినా ప్రయోజనం లేకపోయింది. సత్యవేడు అసెంబ్లీ బదులు తిరుపతి పార్లమెంటు టికెట్ ఖరారు కావడంతో ఆగ్రహించిన ఆయన మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు చేసి వైసీపీ నుంచీ బయటకొచ్చారు. టీడీపీ టికెట్ దక్కించుకుని స్వల్ప మెజారిటీతో గెలిచి తిరిగి అసెంబ్లీలో అడుగుపెట్టారు. సూళ్లూరుపేటలో వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ వద్దంటూ సొంత పార్టీ నేతలే బహిరంగంగా గొడవ చేశారు. అవమానకర పరిస్థితుల నడుమ నలిగిన ఆయన చివరికి ఎలాగో టికెట్ తెచ్చుకున్నా ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. గూడూరులో వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్‌కు కూడా అధిష్ఠానం టికెట్ ఇవ్వకుండా అవమానించడంతో ఆయన బీజేపీలో చేరి తిరుపతి ఎంపీగా పోటీ చేశారు. అయితే గెలవలేదు.

మలిసగం: వైసీపీ నిర్లక్ష్యం చేసినా టీడీపీ ఎమ్మెల్యేగా సత్యవేడు నుంచే గెలిచి సత్తా చూపించారు ఆదిమూలం. అయితే పార్టీకి చెందిన మహిళానేత లైంగిక ఆరోపణలతో ఆయన పేరు ప్రతిష్ఠలకు మచ్చ ఏర్పడింది. టీడీపీ సస్పెండ్ చేసింది. అయితే ఆమె ఫిర్యాదు వెనక్కి తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఇక గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ అభివృద్ధి బాటను ఎంచుకోగా.. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ విస్తృతంగా ప్రజల్లో తిరుగుతూ రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

మంత్రి లేని జిల్లా

ఈ ఏడాది మొదటి భాగంలో మంత్రిగా జిల్లాకు నగరి ఎమ్మెల్యే రోజా ప్రాతినిధ్యం వహించారు. ఎన్నికల తర్వాత గత ఆరు నెలలుగా జిల్లాకు మంత్రి లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మొన్నటి దాకా ముగ్గురు మంత్రులున్న ఉమ్మడి జిల్లాకు కూటమి ప్రభుత్వంలో ఒక్క మంత్రి పదవి కూడా దక్కలేదు. జిల్లా అభివృద్ధిపై సమీక్షించే నేత గానీ, ఎమ్మెల్యేల ప్రతిపాదనలను జిల్లా అధికారులకు, ప్రభుత్వానికి తీసుకెళ్ళే నేత గానీ లేకపోవడం వెలితిగా మారింది.

పదవులు దక్కింది కొందరికే!

కూటమి ప్రభుత్వంలో జిల్లా నుంచీ కొందరికి నామినేటెడ్ పదవులు దక్కాయి. తిరుపతి నుంచీ నలుగురికి పదవులు లభించాయి. శాప్ ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు ఛాన్సు కొట్టేశారు. నరసింహ యాదవ్ తుడా ఛైర్మన్ లేదా టీటీడీ బోర్డు ఛైర్మన్ పదవులు ఆశించగా ఆయనకు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ దక్కింది. రుద్రకోటి సదాశివం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి పొందారు. ఈ ముగ్గురూ టీడీపీ వారు కాగా బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ సభ్యుడిగా నియమితులయ్యారు. మరికొందరికి పదవులు వచ్చినా అవన్నీ కార్పొరేషన్ డైరెక్టర్ వంటివి. ముఖ్యమైన పదవులు ఆశించిన వారికి ఈ ఆరు నెలల్లో అవకాశం దక్కలేదు.

తిరిగి శ్రీవారి సన్నిధికి..



మార్చి 8న శ్రీవారి ఆలయం నుంచి విలపిస్తూ వెళుతున్న గురురాజ్ స్వామి

విలపిస్తూ.. కన్నీళ్లు తుడుచుకుంటూ.. దేవుడికి దండం పెడుతూ.. సాష్టాంగ ప్రణమిల్లి.. ఈ ఏడాది మార్చి 8న తిరుమల శ్రీవారి ఆలయం నుంచి వెనుదిరిగిన టీటీడీ ఉద్యోగి గురురాజ్ స్వామి గుర్తున్నారా..! అప్పట్లో ఓ టీటీడీ ఉన్నతాధికారి కక్ష సాధింపు చర్యతో తిరుపతికి బదిలీ అయిన ఆయన.. తాజాగా తిరిగి శ్రీవారి సన్నిధిలో నియమితులయ్యారు. ఆనాటి ఘటన, పూర్వాపరాలు..

- 6వ పేజీలో

గందరగోళంగా రుద్రాభిషేకం!

- అవస్థలు పడుతున్న భక్తులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం క్రతువు గందరగోళంగా సాగుతోంది. పూజలకు హాజరయ్యే పలువురు భక్తులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. సాధారణంగా ఎక్కడైనా రోజుకు ఒకసారి లేదా విశేష రోజుల్లో మూలమూర్తి అభిషేకాలను నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తిలో మాత్రం ప్రతిరోజు నాలుగు కాలాల అభిషేకం జరగడం విశేషం. ఇందులో మూడు కాలాల్లో జరిగే అభిషేకానికి భక్తులను



అనుమతిస్తారు. ఈక్షేత్రంలో మొదట అమ్మవారికి అభిషేకం నిర్వహించి ఆ తరువాత స్వామివారిని అభిషేకించడం ప్రత్యేకత. ఇంతటి ప్రాశస్త్య క్షేత్రం కావడంతో భక్తులు రుద్రాభిషేకాన్ని జరుపించుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. అభిషేకానికి ముందుగా సహస్ర లింగం వద్ద తూర్పు దిశగా భక్తులను ఉంచి సంకల్పం స్వీకరిస్తారు. సుమారు గంట పాటు భక్తులు సంకల్పం పూజలో కూర్చోవాలి. సహస్ర లింగంవద్ద భక్తులు నేలమీదనే కుర్చోవాల్సి వస్తోంది. కీళ్ల సమస్య ఉన్నవారు, వృద్ధులు, దివ్యాంగులు అంత సమయం కింద కూర్చోలేక ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా చిన్న పీటలు వంటివి ఇవ్వాలని వీరిలో చాలామంది సిబ్బందిని అడుగుతుంటారు. సంకల్పం పూజలు తర్వాత అమ్మవారి సన్నిధికి చేరుకుని అక్కడ అభిషేకం వీక్షించాలి. ఆ తరువాత స్వామివారి సన్నిధికి చేరుకుని అభిషేకాన్ని జరిపించుకోవాలి. మొత్తం రుద్రాభిషేకం పూర్తయి భక్తులు ఆలయం వెలుపలకు వచ్చే సరికి మూడు గంటలు పడుతుంది. ముందుగా సంకల్పం వద్ద నిలబడే భక్తులకు మొత్తం అభిషేకాన్ని పూర్తిచేసే సరికి నీరసించిపోతున్నారు. ఇక, రుద్రాభిషేకం సంకల్ప పూజల్లో గోత్రనామాలను స్వీకరించిన తరువాత పండితులు వేదమంత్రాలు, రుద్రపారాయణం చేస్తారు. ఈ మంత్రోచ్ఛరణలను శ్రద్ధతో శ్రవణం చేస్తేనే అభిషేక ఫలితంప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. అయితే సహస్రలింగం వద్ద మూడు వైపులా రూ.5వేల రాహుకేతు పూజలను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం నిర్వహిస్తుంటారు. సరిగ్గా అక్కడే రుద్రాభిషేకం సంకల్ప పూజలకూ స్థానం కేటాయించారు. సంకల్ప పూజల సమయంలో మూడు వైపులా రాహుకేతు పూజలమంత్రాలు గట్టిగా మైకులో చెబుతుంటారు. అక్కడే రుద్రపారాయణం కూడా కొనసాగుతోంది. దీంతో ఏ మంత్రాలో అర్థం కాక భక్తులు గందరగోళానికి గురవుతున్నారు. రూ.5వేల రాహుకేతుపూజలు అయినా, లేదా రుద్రాభిషేకం సంకల్పస్థానాన్ని అయినా సహస్ర లింగం వద్ద నంచి మార్చాలని భక్తులు కోరుతున్నారు.

అమ్మవారి సేవలో పీవీ సింధు దంపతులు



తిరుచానూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం మధ్యాహ్నం భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు దర్శించుకున్నారు. నూతన జంట సింధు, వెంకట దత్తసాయి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోగా టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని పీవీ సింధు దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వీరికి టీటీడీ క్యాలెండర్, డైరీని భానుప్రకాష్‌రెడ్డి అందజేశారు. అనంతరం అలిపిరి నడకమార్గంలో తిరుమల చేరుకున్న వీరు.. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గాలులు

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలహీనపడి.. మళ్లీ అల్పపీడనంగా మారిందని వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో 1.5 కిలోమీటర్ల మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో వచ్చే 24 గంటలు నెల్లూరు, తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తీరం వెంబడి బలమైన గాలులు వీయనున్నాయి. రానున్న రెండు రోజులు రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే పలు పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. చలిగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంటుందన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

వెల్లుల్లి ఘాటెక్కింది. మూడు నెలల కిందటి వరకు కిలో రూ.280 నుంచి 340 వరకు పలికింది. నేడు ఏకంగా రూ.480కి చేరింది. డిమాండుకు సరిపడా రాకపోవడమే కారణమని అంటున్నారు. ఎందుకంటే తిరుపతి మార్కెట్‌కు వారానికోసారి దాదాపు 60 టన్నులు వస్తాయి. ఇప్పుడు 25 టన్నులు రావడమే గగనంగా ఉందని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. జిల్లాకు అత్యధికంగా మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి వెల్లుల్లి వస్తుంది. అక్కడ కూడా దిగుబడి లేకపోవడం.. వచ్చే వెల్లుల్లి కూడా ముళబాగల్, కోలారు, కేజీఎఫ్ ప్రాంతాలకు అత్యధికంగా తీసుకెళ్లడంతో తిరుపతి మార్కెట్‌కు రావడం తగ్గింది. మార్కెట్‌కు కొత్త సరుకు వస్తేనే ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం వస్తున్న సరుకు షాపులకు చాలడంలేదు. ఒక్కో దుకాణానికి కనీసం 10 కిలోలు కూడా ఇవ్వడంలేదని అంటున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



అందాల పోటీల్లో మెరిసిన పాదిరేడు అమ్మాయి

జాతీయ స్థాయి అందాల పోటీలు-2024లో వడమాలపేట మండలం పాదిరేడుకు చెందిన అల్లూరు సుజన మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డు దక్కించుకున్నారు. ఈ నెల 21న న్యూఢిల్లీలోని పశ్చిమ విహార్ హోటల్లో జాతీయ స్థాయి అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుజన ప్రతిభ కనబరిచి మిస్ ఇండియా-2024 ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు.



మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డు అందుకుంటున్న సుజన

కలికిరి జేఎన్‌టీయూఏలో గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసిన తనకు కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగ అవకాశం లభించినట్లు ఆమె చెప్పారు. తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయురాలు పార్వతి, సెరికల్చర్ ఆఫీసర్ సుబ్రమణ్యం ప్రోత్సాహంతోనే తనకు ఈ అవార్డు దక్కిందన్నారు. ప్రస్తుతం పుత్తూరులో నివాసం ఉంటున్నారు.

- పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి



'కొండ'ంత జనం

వరుస సెలవులతో భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఎటు చూసినా రద్దీనే కనిపిస్తోంది. సర్వదర్శన క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 20 గంటల దర్శన సమయం పడుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం తెలిపారు. జిల్లాలో 2,63,995 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112 కోట్లు కేటాయించిందన్నారు. 31న అందని వారికి జనవరి 2వ తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్‌లో భక్తులు వేచివున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,301


తలనీలాలు సమర్పించినవారు: 26,242



బొక్కసం సూపరింటెండెంట్‌గా

మళ్లీ గురురాజ్ స్వామి

- గత ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలకు గురైన వైనం
- తొలుత ఆలయం, ఆపై తిరుమల నుంచే బదిలీ
- తాజాగా శ్రీవారి ఆలయంలో పోస్టింగ్



తిరుపతి/తిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం బొక్కసం సూపరింటెండెంట్‌గా గురురాజ్ స్వామి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలోని అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను మార్చిలో శ్రీవారి ఆలయం నుంచి తిరుపతికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. శ్రీవారి ఆలయంతో ఎంతో అనుబంధమున్న ఆయన తిరుమల నుంచి వెళుతూ కన్నీరు పెట్టుకోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఈయన గురురాజ్ స్వామి 2002లో టీటీడీలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. తొలి నుంచీ శ్రీవారి ఆలయంలోనే విధులు నిర్వర్తించారు. ఆపై బొక్కసం క్లర్కుగా, తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతులు పొందారు. శ్రీవారి ఆలయంలో బొక్కసం ఇంఛార్జి డాలర్ శేషాద్రి వద్ద సహాయకుడిగా ఉంటూ శ్రీవారి కైంకర్యాలు, పూజాదికాలు, ప్రత్యేక దినాలు, ఉత్సవాల్లో కార్యక్రమాల నిర్వహణపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా బొక్కసం క్లర్కుగా, సూపరింటెండెంట్ హోదాల్లో శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు రోజువారీ, ప్రత్యేక దినాల్లో అలంకరించే అత్యంత విలువైన ఆభరణాలు, బంగారు, వెండి వస్తువులన్నీ ఈయన అధీనంలోనే ఉండేవి. మూలవిరాట్టుకు, ఉత్సవరకుల ఏ రోజుల్లో ఏ ఆభరణాలు అలంకరించాలన్న దానిపైనా లోతైన అవగాహన ఉంది. ఆలయంలో అర్చకులకు, టీటీడీ అధికారులకు నడుమ సంధానకర్తగా, సమన్వయకర్తగానూ వ్యవహరించేవారు. సుమారు రెండు దశాబ్దాల పాటు శ్రీవారి ఆలయంలో పని చేసినా ఆయనపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులూ వచ్చిన దాఖలాలు లేవు. అయితే శ్రీవారి ఆలయంలో కీలకంగా వ్యవహరించే క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులతో పరిచయాలు ఏర్పడ్డాయి. సరిగ్గా అక్కడే గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉన్నతాధికారి ఒకరికి నచ్చలేదన్న ప్రచారం జరిగింది. ఆ కారణంగా గురురాజ్‌స్వామిని తొలుత 2020లో శ్రీవారి ఆలయం నుంచి వెలుపలికి బదిలీ చేశారు. వైభవోత్సవ మండపంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. తర్వాత ఈ ఏడాది మార్చి 8న తిరుమల నుంచీ తిరుపతిలోని టీటీడీ అకౌంట్స్ విభాగానికి బదిలీ చేశారు. అదే రోజున ఆయన శ్రీవారిని దర్శించుకుని ఆలయం నుంచీ వెలుపలికి వచ్చి విలపిస్తూ వెళ్లిపోయారు. వాస్తవానికి డాలర్ శేషాద్రి మరణంతో ఆయన స్థానాన్ని గురురాజ్‌స్వామితో భర్తీ చేస్తారని టీటీడీ వర్గాలు భావిస్తున్న తరుణంలో ఆయన్ను ఏకంగా తిరుమల నుంచే కిందకు బదిలీ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ శ్రీవారి సన్నిధిలోనే గడిపానని, వైభవోత్సవ మండపానికి బదిలీ చేసినా కొండపైనే శ్రీవారి ఆలయ సమీపాన్నే కాబట్టి సంతోషంగా విధులు నిర్వర్తించానని అప్పట్లో ఆయన సన్నిహితులకు చెప్పుకొన్నారు. అయితే కొందరు కక్షకట్టి తిరుమలలోనే ఉండకుండా బదిలీ చేయించడం తట్టుకోలేకపోతున్నానంటూ వాపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శ్రీవారి ఆలయంలో బొక్కసం నిర్వహణకు, అలాగే అర్చకులు, అధికారుల నడుమ సమన్వయానికి సంబంధించి అవగాహన కలిగిన ఉద్యోగులు లేకపోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో గురురాజ్‌స్వామిని తిరిగి శ్రీవారి ఆలయానికి బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

> ఈ బదిలీకి సంబంధించి ఎలాంటి మార్పుచేర్పులు, రద్దు వంటి అభ్యర్థనలను, ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకునేది లేదంటూ ఈ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. ఈ విధంగా ఏ స్థాయి అధికారికి గానీ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొనడం అత్యంత అరుదనే చెప్పాలి. స్వామివారే తన సేవకు మళ్లీ పిలిపించుకున్నారని గురురాజ్‌స్వామి 'ఆంధ్రజ్యోతి'తో సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్రెర్రని జెండా

- ఘనంగా సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలో గురువారం సీపీఐ శత ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్ర తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలతో తిరుపతి నగరం ఎరుపెక్కింది. అన్నమయ్య కూడలి నుంచి బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయం వరకు కళాబృందాలతో ర్యాలీ నిర్వహించారు. పద్మావతి పార్క్ వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పార్టీ వందేళ్ల చరిత్రను గుర్తు చేస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి ముందుకురావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, కె.శివారెడ్డి, సి.పెంచలయ్య, రాధాకృష్ణ, బి.నదియా, చంద్రశేఖరరెడ్డి, ఎన్.డి.రవి, గుర్రప్ప, నాగరాజు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న హరినాథ రెడ్డి తదితరులు



తిరుపతిలో సీపీఐ నేతల ర్యాలీ

పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభం



రాయలచెరువులో బోట్లను పరిశీలిస్తున్న శాప్‌చైర్మన్ రవినాయుడు

రామచంద్రాపురం/తిరుపతి(క్రీడలు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రాయలచెరువులో గురువారం పడవ (డ్రాగన్ బోట్) పోటీల ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభమయ్యాయి. చిత్తూరు, నెల్లూరు, కర్నూలు, విజయవాడ, వైజాగ్ జిల్లాల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలకు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ప్రాక్టీసు సెషన్స్ కొనసాగాయి. చెరువులో 1,000మీటర్ల పొడవుతో 30రౌండ్స్ వేశారు. ఒక్కోదానిలో 12మంది చొప్పున కూర్చొని పడవను వేగంగా ముందుకు నడిపారు. చిన్న పడవల్లో ఒక్కొక్కరూ నడిపారు. క్రీడాకారులు చేస్తున్న పొరపాట్లను అక్కడే ఉన్న కోచ్‌లు గమనించి ముఖకవళికలతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఇలా 29వ తేదీ వరకు ప్రాక్టీస్ సెషన్స్ చేస్తూ 30, 31 తేదీల్లో అధికారిక టైమింగ్స్‌కు పడవ పోటీలు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచినవారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. గురువారం శాప్‌చైర్మన్ రవినాయుడు రాయలచెరువులో పర్యటించి పడవ పోటీల ప్రాక్టీస్ సెషన్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు దేవరాజులు, రాయలచెరువుపేట సర్పంచ్ మురగయ్య, మాజీ సర్పంచ్ మాధవి, నీటి సంఘాల అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీడీవో ఇందిరమ్మ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమజంట ఆత్మహత్యకు యత్నించిన ఘటన చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరికి చెందిన గురవయ్య కుమారుడు భరత్ (21), కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయమ్మ కుమార్తె రాజేశ్వరి (19)లు తిరుపతిలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఐదునెలలుగా ప్రేమించుకున్న వీరు గురువారం చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ గుడిలో వివాహం చేసుకున్నారు. భరత్ స్నేహితుడు చిత్తూరులోని రామ్‌నగర్‌కాలనీ విస్డమ్ స్కూల్ సమీపాన నివాసం ఉండగా, సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. తర్వాత స్నేహితుడికి ఫోన్ చేయగా అతను స్పందించక పోవడంతో భయపడి తమ వెంట తెచ్చుకున్న రసాయనాన్ని తాగేశారు. స్థానికులు గమనించి, వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పోలీసులు విచారిస్తున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయి.. సహకరించండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పలు పరిశ్రమలు వస్తున్నాయని, భూసేకరణకు సహకరించాలని సత్యవేడు మండల రైతులను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సత్యవేడు మండలం తొల్లడం, పెద్దఈటిపాకం, ఇరుగళం, చిన్న ఈటిపాకం రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లోని సుమారు 55.66 ఎకరాల భూసేకరణకు ఈనెల 15న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అందులో 40 ఎకరాల పట్టా భూమి ఉందని, ఆ మేరకు రైతులతో నష్టపరిహారంపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ చర్చించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): టీటీడీ డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమలలో జరుగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడవచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు: 0877 2263261.

టీటీడీ నిధుల వ్యయానికి 'చికిత్స'

- కొన్ని ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు భారీగా నిధుల కేటాయింపు అవసరమా..
- పరిశీలనకు తాజాగా కమిటీ నియామకం

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాల వ్యయంపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. రూ.వేల కోట్ల నిధులను ఆస్పత్రుల పేరుతో మళ్లించడం ఏమేరకు సమంజసమనే దిశగా యోచిస్తోంది. ఇటీవల దీనిపై ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. టీటీడీ మాజీ ఈవో, పూర్వపు జిల్లా కలెక్టర్, హెల్త్ స్పెషల్ సెక్రటరీగా పనిచేసి రిటైరైన ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రులను, భవన నిర్మాణాలను పరిశీలించింది. టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, ఆయుర్వేద, బర్డ్ వంటి ఆస్పత్రులు నడుస్తున్నాయి. మరోపక్క, గత వైసీపీ ప్రభుత్వంలో పద్మావతి చిన్నపిల్లల హృదయాలం ఆస్పత్రి నిర్మాణ పనులనూ ప్రారంభించింది. దీని నిర్మాణానికే దాదాపు రూ.300 కోట్లకుపైగానే కేటాయించింది. స్విమ్స్‌లో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ విభాగం, మరో భారీ భవన నిర్మాణాలకు రూ.200 కోట్లకుపైగా కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో మరికొన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కూడా భారీగా నిధులు కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. వాటిన్నిటికీ దాదాపు రూ.వెయ్యి నుంచి రూ.1,200 కోట్ల వరకు అవసరమవుతుంది.

టాటా సంస్థ ఉండగా మళ్లీ కేన్సర్‌కు నిధులా..

వాస్తవానికి క్యాన్సర్ రోగులకోసం ఇప్పటికే టాటా ట్రస్టు వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రిసెర్చ్, కాంప్రెస్ క్యాన్సర్ ఆస్పత్రి (స్వీకార్) నిర్మించి సేవలు అందిస్తోంది. ఈక్రమంలో మళ్లీ బాలాజీ ఇనిస్టిట్యూట్ అంకాలజీ ఎందుకని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం టీటీడీ ఆదాయం కంటే ఖర్చే అధికంగా ఉంటోందని ప్రస్తుత అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే ఆస్పత్రుల నిర్వహణ, నిర్మాణాలకు ఈస్థాయిలో నిధులు అవసరమా అనే కోణంలో విశ్లేషిస్తున్నారు. గత ప్రభుత్వంలోని అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని భావిస్తున్నారు. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేనప్పుడు కోట్లాది రూపాయల కేటాయించడం ఎంతమేరకు సబబనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రత్యేక కమిటీ ఈ మొత్తం వ్యవహారంపై నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

ఆగివున్న లారీని ఢీకొన్న మినీలారీ

- డ్రైవర్ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ ముందుభాగం - లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా

దొరవారిసత్రం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మినీలారీ డ్రైవర్ రాజా కరుపాల్యా(27) మృతి చెందాడు. సౌక కొయ్యల లోడుతో వెళ్తున్న లారీ టైరు పంక్చర్ కావడంతో కుప్పారెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆగింది. బత్తాయి పండ్ల లోడుతో గుజరాత్ నుంచి చెన్నై వెళ్తున్న మినీలారీ బుధవారం అర్ధరాత్రి ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సౌక కొయ్యలు మినీలారీ క్యాబిన్‌లోకి చొచ్చుకుపోవడంతో డ్రైవర్ రాజా తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది స్థానికుల సహకారంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజా కరుపాల్యాను బయటకు తీసి 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గదుల జారీని పర్యవేక్షిస్తున్న అదనపు ఈవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదుల జారీ ప్రక్రియను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సిఫార్సులున్నప్పటికీ తిరుమలలో గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ34 కార్యాలయాల వద్ద భక్తులు అధిక సమయం నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన విషయం తెలిసిందే. వెంకయ్య చౌదరి పద్మావతి విచారణ కార్యాలయానికి వెళ్లి ఏఏ సిఫార్సులపై గదులు కేటాయిస్తున్నారు, ఏ సమయంలో ఎన్ని గదులు భక్తులు పొందుతున్నారు, అవకతవకలు ఏమైనా జరుగుతున్నాయా, భక్తులకు ఎందుకు ఆలస్యం అవుతోంది, ఎక్కడ గదులు బ్లాక్ అవుతున్నాయి వంటి అంశాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా లభ్యతను బట్టి గదులు కేటాయించాలని, వీలైనంతవరకు నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదు

రేణిగుంట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రేణిగుంటలో డెంగ్యూ కేసు నమోదైంది. రేణిగుంట పంచాయతీ పరిధిలోని బుగ్గవీధిలో ఓ మహిళకు డెంగ్యూ పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. గురువారం ఆ ప్రాంతంలో చుట్టుపక్కల ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారి వద్ద ఏఎన్ఎంలు రక్తనమూనాలు సేకరించారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. డెంగ్యూ జ్వరం పట్ల ప్రజలు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఇంటిలోపల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి సూచించారు.

వైసీపీ కార్పొరేటర్ల కొత్త కూటమి

- ఎన్డీయే స్థానిక నేతలను మెప్పించిన తర్వాతే ఆయా పార్టీల్లోకి
- అప్పటివరకు స్వతంత్రంగానే వ్యవహరిస్తాం
- పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



సమావేశమైన డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లు కొత్త కూటమిగా ఏర్పాటవుతున్నారు. ఎన్నికల అనంతరం ఎన్డీయే కూటమిలో చేరేందుకు పలువురు విఫలయత్నం చేసిన విషయం తెలిసిందే. ఇందుకుగల అడ్డంకులను సమీక్షించుకుని, వాటిని అధిగమించి టీడీపీ, జనసేనలో చేరేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈమేరకు గురువారం అందుబాటులో ఉన్న దాదాపు 10 మంది కార్పొరేటర్లు పాయ్‌వైశ్రాయ్ హోటల్లో సమావేశమై చర్చించుకున్నారు. గత వైసీపీ పాలనలో టీడీపీ, జనసేన శ్రేణులను ఇబ్బందిపెట్టని కార్పొరేటర్లను చేర్చుకునేందుకు ఎన్డీయే ప్రభుత్వానికి ఇబ్బందిలేదని, గతంలో తామలా వ్యవహరించలేదు కాబట్టి పార్టీలో చేరేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవని అభిప్రాయపడ్డారు. అయితే ఆయా డివిజన్లలోని స్థానిక నాయకత్వాన్ని కూడా మెప్పించి పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి గందరగోళం లేకుండా ముందుకుపోవచ్చని భావించారు. గత కౌన్సిల్ తీర్మానం మేరకు కార్పొరేటర్లకు నెలలో ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించాలని కోరుతూ టీటీడీ ఛైర్మన్‌ను కలవాలని నిర్ణయం తీసుకున్నారు. ఏదైనా పార్టీలో చేరేవరకు తాము ఎవరికీ అనుకూలంగా ఉండమని, అవిశ్వాసం కూడా పార్టీ నిర్ణయాలమేరకు ఉంటుందని తీర్మానం చేసుకున్నట్టు తెలిసింది. ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు నరసింహాచారి (25వ డివిజన్), నరేంద్రనాథ్ (38), దూది కుమారి భర్త శివ(33), కుడితి సుబ్రమణ్యం (36), పొన్నాల చంద్ర (28), దొడ్డారెడ్డి మునిశేఖర్ (11), అనిల్ (50వ డివిజన్) సమావేశానికి హాజరైనట్టు తెలిసింది. మరికొంతమంది ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపినట్టు సమాచారం.

- అన్నమయ్య విగ్రహం ఘటనలో

నిందితుడి అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య సర్కిల్‌లోని అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టిన నిందితుడిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య విగ్రహానికి టోపీ పెట్టడంతో దుమారం రేగింది. భజరంగదళ్ నాయకులు విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఎంఆర్ పల్లి పరిధిలోని ఉల్లిపట్టెడకు చెందిన ఎస్.విష్ణుప్రతీక్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అన్నమయ్య సర్కిల్ వద్ద లభించిన సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఇతడు మహారాష్ట్రలోని పర్భానీ తాలూకా పెడ్గోన్ గ్రామానికి చెందిన భందుదార్శి జవహర్‌గా గుర్తించారు. 15 రోజుల కిందట తిరుపతికి వచ్చిన ఇతడు.. చిత్తు పేపర్లు ఏరుకుంటూ ప్లాట్‌ఫారాలపై పడుకునేవాడు. ఈనెల 23న శాంతాక్లాజ్ టోపీ దొరకగా అన్నమయ్య విగ్రహంపై ఉంచాడు. ఇతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

పశుగణనను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారరం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పాల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసం పెంపకం, మినీ గోకుల షెడ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, అధికారులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన ఆ శాఖ అధికారులతో సమీక్షించారు.

ఎస్వీయూ స్టోర్స్ ఆరోపణలపై విచారణ ముమ్మరం

తిరుపతి, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని కో ఆపరేటివ్ స్టోర్స్ గత వైసీపీ పాలనలో పక్కదారి పట్టింది. దాన్ని రాజకీయ కేంద్రంగా మార్చేసి అక్రమ నియామకాలకు తెరలేపినట్టు వెలుగులోకి వచ్చింది. ఒక్కసారి కూడా సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా వైసీపీ తరపున చక్రంతిప్పే ఒక ప్రొఫెసర్ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారన్న విమర్శలు వచ్చాయి. అతని అనుయాయులను ఉద్యోగులుగా నియమించినట్టు తెలిసింది. ఈ క్రమంలో కొంతమంది ఉద్యోగులు దౌర్జన్యంగా స్టోర్ వ్యవహారాల్లో కీలకంగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు, తెలుగు యువత సంయుక్తంగా కోఆపరేటివ్ స్టోర్స్ జిల్లా అధికారికి మూడు నెలల ముందు కోరాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టడంతో పలు అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నట్టు తెలుస్తోంది. గురువారం కూడా ఎస్వీయూ స్టోర్‌లో విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్కే నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి షైలారి అశోక్‌లను శుక్రవారం విచారించి, వారి వద్ద ఉన్న ఆధారాలను అధికారులు సేకరించనున్నారు.



ఆలయం ముందు జస్టిస్ టీసీడీ శేఖర్

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, టేబుల్‌టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.





జస్టిస్ దుప్పల వెంకటరమణ - నైనా జైస్వాల్

రెవెన్యూ సదస్సులకు 730 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 48 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 730 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. అందులో ఇళ్ల స్థలాల కోసం 114, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 45, కుల ధ్రువీకరణ కోసం 1, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 11, ఆర్‌వోఆర్ 345, ఇతర విషయాలకు 129 ఉన్నాయని వివరించారు. 58 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 12,306 అర్జీలు వచ్చాయన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ మదనపల్లె ప్రాంతంలోని పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురిని గుర్తించి, డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

మహిళలపై దాడిచేస్తే కఠినంగా శిక్షించాలి

- మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



తిరుమల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కఠినమైన శిక్షలు అమలుచేస్తేనే నేరాలు చేయాలనుకునేవారిలో భయం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అప్పుడే ఆడవారికి నిజమైన రక్షణ కల్పించవచ్చన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగిన క్రమంలో శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. స్వామిని దర్శించుకోమని ఎవరు ఎలాంటి ప్రచారం చేయకపోయినప్పటికీ రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటం శ్రీవారి మహిమ అన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే జైలుకే..



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, పక్కన టీడీపీ నేత మనోహర్, సర్పంచు రమణమ్మ

డక్కిలి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు పాల్పడితే ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందేనని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కేబీపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తులు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా భూ ఆక్రమణలు, హద్దురాళ్ల తొలగింపు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. భూ ఆక్రమణలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు రసీదులు ఇస్తున్నామని, వీలైనంత త్వరగా ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచు రమణమ్మ, మండల సర్వేయర్ రాజగోపాల్, ఆర్ఐ ప్రియాంక, టీడీపీ నేత మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మద్వేంకట రామ్మూర్తి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని పార్కువీధిలో ఉన్న మద్వేంకట రామ్మూర్తిస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబ ఆధ్వర్యంలో లెక్కించారు. పది నెలల కాలానికి రూ.3,04,924 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బీరక రాంబాబు, స్థానికులు అయితా శ్రీధర్, నాపా మునిరాజా, ఎస్.కుమారస్వామి, కే.వెంకటేశ్వర్లు, ఎం.సురేష్, జీ.త్యాగరాయం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి



సుధాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు తదితరులు

వెంకటగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 14వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు సుధాకర్(52) గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం సుధాకర్ నివాసానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న సుధాకర్ మృతి బాధకరమన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



సాయిమోహన్‌రెడ్డి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నాయుడుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి కుటుంబానికి యూటీఎఫ్ జిల్లా నాయకులు రూ.లక్ష సాయం చేశారు. నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటూ దొరవారిసత్రం మండలంలో పనిచేస్తుండిన ఉపాధ్యాయుడు సాయిమోహన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు కుటుంబ సంక్షేమ సంఘం నుంచి రూ.లక్ష చెక్కును యూటీఎఫ్ నాయకులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, ఉపాధ్యాయుల కుటుంబ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్ఎస్ నాయుడు, కార్యదర్శి మోహన్‌బాబు, కోశాధికారి రాజేష్‌బాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, గోవర్ధన్‌రెడ్డి, సుబ్బారావు, శేఖర్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ధ్యేయం



సీపీఐ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ నాయకులు

గూడూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. గురువారం సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక సీపీఐ కార్యాలయం, టవర్‌క్లాక్ సెంటర్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వతంత్ర నినాదంలో 1925 డిసెంబరు 26న సీపీఐ ఆవిర్భవించిందన్నారు. ఈ వందేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారంపై పార్టీ అలుపెరుగని పోరాటాలు సాగించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, రమేష్, మస్తానయ్య, ఎంబేటి చంద్రయ్య, నారాయణ, చల్లా వెంకటేశ్వర్లు, శ్రీనివాసమూర్తి, జమాలుల్లా, భాస్కర్, యశ్వంత్, యాకోబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుంటలో రెవెన్యూ సదస్సు

ఓజిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఇనుగుంట, రంగరాజసముద్రం గ్రామాల్లో గురువారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూముల సర్వే, పాసు పుస్తకాల కోసం రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని తపాలా కార్యాలయం నుంచి పీర్లచావడి పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ శేఖర్ తెలిపారు. అదే విధంగా మధ్నాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాయినగర్, చేపల మార్కెట్, పరమేశ్వరి నగర్, గాండ్లవీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట



స్వర్ణముఖినదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా దారులను మూసివేస్తున్న వీఆర్వో మురళి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమ రవాణా చేయకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో గురువారం ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, వీఆర్వో మురళి స్వర్ణముఖినది నుంచి ట్రాక్టర్లు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో దారులను మూసివేయించారు.

రొయ్యలకు 'వైట్‌స్పాట్'

- లక్షల్లో చనిపోతున్న పిల్లలు
- లబోదిబోమంటున్న ఆక్వా రైతులు





వైట్‌స్పాట్‌తో చనిపోయిన రొయ్యలు - వ్యాధి సోకిన రొయ్యలు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరకు నష్టాలు చవిచూస్తూ వచ్చిన రొయ్య రైతులకు మళ్లీ చేదు అనుభవం ఎదురవుతోంది. దశాబ్దకాలంగా వెనామి రొయ్యలతో లాభాలు గడిస్తూ చివరిదశలో నష్టాలు రావడంతో మళ్లీ ఆక్వా రైతులు టైగర్ రొయ్యసాగుపై దృష్టి పెట్టారు. మూడేళ్లుగా టైగర్ రొయ్యసాగు చేస్తూ వస్తున్నారు. అయితే టైగర్‌కు కూడా వైట్‌స్పాట్ వ్యాధి సోకడంతో మూలిగేనక్కపై తాడికాయ పడ్డట్లుగా ఆక్వా రైతులు నష్టాల ఊబిలోకి వెళ్లిపోతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సముద్రతీర ప్రాంతాలైన కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాలు రొయ్యల సాగుకు ప్రసిద్ధి. ప్రస్తుతం కొన్ని మండలాల రైతులు టైగర్ సాగుచేస్తుండగా కొందరు వెనామి సాగు చేస్తున్నారు. గత 20రోజుల నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనాల కారణంగా ఆకాశం మేఘావృతం కావడం, విపరీతంగా మంచు కురవడంతో టైగర్, వెనామి రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. మంచు 18నుంచి 20 డిగ్రీల వరకు పడిపోవడంతో నీటి సాంద్రత తగ్గిపోయి రొయ్యలకు శ్వాశకోశ సంబంధితమైన వైట్‌స్పాట్ వ్యాధి సోకుతోంది. ఈ వ్యాధి సోకినప్పటి నుంచి రొయ్య పిల్లలు ఆహారం తినడం మానేసి రోజురోజుకూ బలహీనపడిపోతాయి. మొప్పలపై నల్లని, తెల్లని మచ్చలు ఏర్పడి చనిపోయి గుంతల్లోని ఒడ్డుకు చేరుతాయి. కోట మండలంలోని గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, వాకాడు మండలంలోని దుగరాజపట్నం గ్రామాల్లో సాగవుతున్న రొయ్యలకు వైట్‌స్పాట్ సోకి లక్షల్లో పిల్లలు చనిపోతున్నాయి. రొయ్య పిల్ల 18 రోజుల నుంచి 60 కౌంట్ వరకు ఈ వ్యాధి సోకుతుంది. ఎన్ని మందులు వాడినప్పటికీ వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధి తగ్గకపోవడంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానుల తమ షాపుల వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ రమణ అన్నారు. గురువారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాలలు, అపార్ట్‌మెంట్లు, బ్యాంకులు, హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుబ్బరావు, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను అర్హులకు ఇవ్వండి



తహసీల్దార్ ద్వారకనాథరెడికి వినతిపత్రం అందిస్తున్న రైతులు, పక్కన సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, సత్యంరాజు, మురళీనాయుడు

పెళ్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోసనూరు గ్రామ రెవెన్యూలో పరిధిలోని సర్వే నెంబర్ 1లో పేదలకు పంచిన 40 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని అర్హులకు ఇవ్వాలని తహసీల్దార్ ద్వారనాథరెడ్డిని ఆ గ్రామస్తులు కోరారు. గురువారం మండలంలోని రోసనూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ ఆక్రమణలుపై గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలిగించాలని నాలుగు, పట్టాదారు పాసుపుస్తకం కోసం రెండు, సర్వే కోసం రెండు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి, మండల సర్వేయర్ పూజిత, వీఆర్వో వంశీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్టు సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు దొమ్మరాజు సత్యనారాయణరాజు, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయండి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమ్మెకాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గత ఏడాది 17 రోజుల సమ్మె నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అప్పట్లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. సాధారణ, ప్రమాదంలో మరణించిన మున్సిపల్ కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే రిటైర్ మెంట్ బెనిఫిట్స్, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపు తదితర డిమాండ్‌లను పరిష్కరించడంతో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ గతేడాది సమ్మె చేపట్టామని గుర్తు చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, జోగి శివకుమార్, సురేష్, బీవీరమణయ్య, మణి, శంకరయ్య, మురళి, ప్రభావతి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు మురళీరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలాయాల్లో అన్యమతస్థులను తొలగించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా హిందూవులే ఉండాలన్నారు. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో రాజకీయ ప్రమేయంలేని హిందూ భక్తులను మాత్రమే సభ్యులుగా నియమించాలన్నారు. ఆలయాల మీద వచ్చే ఆదాయాన్ని హిందూధర్మ ప్రచారానికి మాత్రమే వినియోగించాలన్నారు. హైందవ శంఖారావం సభలో హిందూవులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణయ్య, రవిచంద్ర, రామయ్య, సత్యానందస్వామి, సనత్‌కుమార్‌రెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, గాలి ప్రకాష్‌నాయుడు, మనోజ్, మల్లికార్జున, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దారుకు ఫిర్యాదు అందజేస్తున్న గోవిందపల్లి గ్రామస్తులు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్మశాన భూములను కొంత మంది భూస్వాములు ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ మండల పరిధిలోని గోవిందపల్లి గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం పంచాయతీ కేంద్రమైన కొత్తపట్నంలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. పంచాయతీలోని పలు గ్రామాలకు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. గోవిందపల్లిలో కొంతమంది రైతులు శ్మశాన భూములపై తమ పొలాల్లో కలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు తక్షణం స్పందించి శ్మశాన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. కొన్ని సమస్యలను రెవెన్యూ సిబ్బందితో అక్కడిక్కడే పరిష్కరించగా కొన్ని అర్జీలను వివిధ శాఖల అధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు తిరుపాలయ్య, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం పుల్లూరు యువకుడి మృతి

తిరుత్తణి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లా యువకుడు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పెళ్లకూరు మండలం పుల్లూరుకు చెందిన సురేష్ (34), అదే గ్రామానికి చెందిన వినోద్‌తో కలసి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. పల్లిపట్టు సమీపంలోని నగరి రహదారిలో బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో సురేష్ మృతిచెందగా, వినోద్‌కు గాయాలయ్యాయి. పల్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

ఓజిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తరచూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్య ఉందని, దీనిపై ఆయా పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లకు సమీపంలో పేడ దిబ్బలు, ఇతర వ్యర్థాలు ఉండకుండా చూడాలన్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు.

సీపీఐ శత వార్షికోత్సవం

తడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 100వ వార్షికోత్సవ వేడుకలు తడలో నిర్వహించారు. గురువారం స్థానిక బజారుకూడలిలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. చాక్లెట్లను పంచిపెట్టారు. దేశంలో పార్టీ ఏర్పాటై 99 యేళ్ల పూర్తిచేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని ఆయన అన్నారు. కార్మిక ప్రత్యేక పీడిత అట్టడుగువర్గాల అభ్యున్నతికి పోరాటం చేసిందని కొనియాడారు. ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుమార్, నాయకులు వెంకటేష్, చల్లయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారిపాళెంలో క్రిస్మస్ వేడుకలు



చర్చి వద్ద చిన్నారులు రూపొందించిన పశువుల పాక

చిల్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాళెంలో ఉన్న లూథరన్ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. గ్రామంలో ఎక్కువ మంది బిషప్‌లు, పాస్టర్లు ఉండడంతో వీరంతా 25న ఇతర ప్రాంతాల్లోని చర్చిలకు వెళతారు. దీంతో కమ్మవారిపాళెం గ్రామంలోని ఏటా డిసెంబరు 26న క్రిస్మస్ వేడకలు జరుపుకుంటారు.

నేటి పోరుబాటను జయప్రదం చేయండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును ఖండిస్తూ సబ్‌స్టేషన్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

మున్సిపల్ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వెంకటగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించడంతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, డ్రైవర్లకు జీవో నెంబరు 36 ప్రకారం రూ.24వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల అవుతున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

చేపల వలలో చిక్కుకుని కొండచిలువ మృతి

చిల్లకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేపల వలలో చిక్కుకుని కొండచిలువ మృతి చెందిన ఘటన చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామానికి చెందిన కొందరు సమీపంలోని సొనకాలువలో చేపల వల వేశారు. వలను బయటకు తీయగా కొండచిలువ ఉండడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే పాము మృతి చెందివుండడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పేదలకు దుస్తులు, ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు దుస్తులు, ఆహారపొట్లాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మంజుల, శ్రీవిద్య దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, పెంచలయ్య, నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బజారుసెంటర్, గోపాల్‌రెడ్డి విగ్రహం సెంటర్, సారంగంవారివీధిలో టీడీపీ సభ్యత్వ సౌకర్యాలను వివరిస్తూ పలువురికి సభ్యత్వం నమోదు చేయించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడారులతో టెన్నికాయిట్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉండడంతో పాటు పట్టుదల, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జిల్లాలోని జూనియర్ కళాశాలలకు చెందిన 40మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనగా జూనియర్ బాలికల, బాలుర జిల్లా జట్ల ఎంపిక చేశారు. వీరు జనవరి 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, కోటేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ స్వర్గధామానికి రూ.50వేల విరాళం



స్వర్గధామం నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న గోపాలరెడ్డి

నాయుడుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని హిందూ శ్మశాన వాటిక స్వర్గధామం అభివృద్ధికి టీడీపీ నాయకుడు, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు అత్తివరం గోపాల్‌రెడ్డి రూ.50వేలు విరాళంగా గురువారం అందజేశారు. స్వర్గధామం నిర్వాహకులు ఉదయశంకర్, కృష్ణారావుకు నగదు అందజేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కోట, తుమ్మానాయుడుపాళెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల్లో బాబా విగ్రహాలకు పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.